RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 256 మేడ్చల్ మల్కాజ్‌గిరి 9 అక్టోబర్ 2024 బుధవారం పేజీలు : 4

### మళ్లీ పెరిగిన టమాట ధర.. రంగంలోకి దిగిన కేంద్రం

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా దసరా వేడుకలు జరుగుతున్నాయి. మరో వైపు నిత్యవసర ధరలు ఆకాశానంటుతున్నాయి. ఇప్పటికే పప్పులు, ఉప్పులు ధరలు భారీగా పెరిగాయి. ఇక వంట నూనెల ధరలు అయితే సలసలా కాగుతున్నాయి. అలాగే కూరగాయలు ధరలు సైతం పప్పులు, ఉప్పులు, వంట నూనెల ధరలతో పోటి పడుతున్నాయి. ఇక దేశ రాజధాని న్యూఢిల్లీలో కూరగాయల మార్కెట్‌లో కిలో టమాట ధర రూ. 100కు చేరింది. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. వినియోగదారులకు సబ్సిడీ మీద కేజీ టమాట రూ. 65లకే అందజేయాలని నిర్ణయించింది. నేషనల్ కో ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌సీసీఎఫ్) ద్వారా టమాట విక్రయిం చేందుకు ఏర్పాట్లు చేస్తుంది. దీని ద్వారా ఢిల్లీ మహానగరంలోని వివిధ ప్రాంతాల్లో మొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేసి... వినియోగదారులకు టమాట విక్రయించనుంది.



# మోదీ - షా ద్వయం...

# మరో సారి అదిరింది

## సార్వత్రిక ఎన్నికల షాక్ నుంచి కోలుకున్న కమలం..!

## ఎగ్జిట్ పోల్స్‌ను తలకిందులు చేస్తూ ... హరియాణాలో ఘన విజయం...!!

లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ రౌండ్లు ముగిసేకొద్దీ భాజపాకు ఊరట లభించింది. ఈ సారి పోలింగ్ జరిగిన రెండు రాష్ట్రాల్లో కాషాయ దళం అంచనాలకు మించి రాణించింది. దీంతో ఓ రకంగా ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికలనుంచి తగిలిన షాక్ నుంచి కోలుకొన్నట్లైంది. ముఖ్యంగా హిందీ హార్ట్‌ల్యాండ్‌కు తాళంగా భావించే హరియాణాలో పట్టు నిలుపుకోవడం ఆ కమలం పార్టీకి కొండంత బలాన్ని ఇచ్చింది. ఇప్పటికే హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ పాలనలో ఉండటంతో.. తాజాగా హరియాణాను కోల్పోతే ఆ ప్రభావం మిగిలిన వాటిపై పడుతుందని ప్రతిపక్షాలు ఆశలు పెట్టుకొన్నాయి. కానీ, ఈ విజయంతో భాజపా ఖాతాలోకి 13వ రాష్ట్రం చేరినట్లైంది. హరియాణా విజయంతో 2029 ఎన్నికలకు సన్నాహాలను ఉత్సాహంగా ప్రారంభించాలన్న ప్రత్యర్థుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. మోదీ–షా ద్వయాన్ని ఓడించడం అంత తేలిక కాదనే సంకేతాలను పంపింది. హరియాణా కనుక చేజారితే మిత్రపక్షాల సాయంతో కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న ఎన్‌డీఏ కూటమిపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఎల్‌జేపీ, జనతాదళ్ యూ వంటి పార్టీలు సమీప భవిష్యత్తులో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కూటమిపై ఒత్తిడి పెంచే ప్రమాదం నుంచి భాజపా బయటపడినట్లైంది.

**అధికారం దక్కకపోయినా.. పుంజుకొన్న కమలం..** మరోవైపు జమ్మూకశ్మీర్‌లోనూ ఆ పార్టీ బలమైన శక్తిగానే ఆవిర్భవించింది. గతంలో 25 సీట్లకే పరిమితమైన ఆ పార్టీ ఈ సారి మరిన్ని స్థానాలను తన ఖాతాలో వేసుకొంది. నేషనల్ కాన్ఫరెన్స్ తర్వాత అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. ఓటింగ్ పరంగా చూస్తే అతిపెద్ద పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ కంటే దీనికే ఎక్కువ ఉండటం విశేషం. భవిష్యత్తులో పొత్తులు కుదిరితే మాత్రం అధికారం అందుకోవడం తమకు ఏమాత్రం కష్టం కాదని సంకేతాలు ఇస్తోంది. ఇప్పటికే గవర్నర్ నియమించే ఐదుగురు సభ్యుల మద్దతు కమలం పార్టీకి దక్కనుంది. ఈ ఎన్నికల్లో పొత్తులు లేకపోయినా.. భవిష్యత్తులో జమ్మూ ప్రాంతంలో విస్తరించాలని భావించే పార్టీలు కచ్చితంగా భాజపాతో జట్టుకట్టే అవకాశం ఉంటుంది. నియోజకవర్గాల పునర్విభజనలో జమ్మూ ప్రాంతానికి ప్రాధాన్యం పెంచడం కమలం పార్టీకి కలిసొచ్చిన అంశం. దీనికి తోడు ఎల్జీ పాలనలో వేర్పాటు వాదులను బలంగా అణచివేయడంతో కశ్మీర్‌తో పోలిస్తే.. ప్రశాంతంగా ఉండే జమ్మూలో పార్టీ ఇమేజ్‌ను బలోపేతం చేసింది. దీంతో కశ్మీర్ కేంద్రంగా పనిచేసే పీడీపీ, ఎన్‌సీ వంటి పార్టీలు జమ్మూకు ప్రాధాన్యం ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొంది. భవిష్యత్తులో కశ్మీర్‌లో పగ్గాలు చేపట్టే పార్టీ ఏకపక్షంగా వేర్పాటు వాదాన్ని వెనకేసుకొచ్చే పరిస్థితి ఉండే అవకాశం లేదు.

**రెట్టించిన ఉత్సాహంతో మహారాష్ట్ర, ఝార్ఖండ్‌కు..** మరికొన్ని రోజుల్లో మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లో కూడా ఎన్నికల నగారా మోగనుంది. ఇక్కడ భాజపాకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని ఇప్పటికే సర్వేలు చెబుతున్నా.. ఈ ఫలితాలు ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ మిత్రపక్షాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయవచ్చు. మహారాష్ట్రంలో భాజపా ఇప్పటికే సర్వశక్తులు ఒడ్డి పోరాడేందుకు సిద్ధమవుతుంది. మరోవైపు ఝార?ండ్‌పై ఇప్పటికే భాజపా గురిపెట్టింది. ప్రధానే స్వయంగా ఇప్పటికే పలు మార్లు ఆ రాష్ట్రాన్ని సందర్శించారు. బంగ్లాదేశీయ చొరబాట్లు, హిందువులపై దాడులు వంటి అంశాలను అక్కడ పార్టీ ఆధారంగా చేసుకొని ప్రచారం చేస్తోంది. దీనికి తోడు హేమంత్ సొరెన్ అవినీతి కేసులో అరెస్టు కావడం వంటివి కూడా ఇండియా కూటమికి ప్రతికూలంగా మారవచ్చు. మొత్తం మీద ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓ రాష్ట్రంలో అధికారం దక్కినా.. కీలకమైన హరియాణాలో రాణించకపోవడం పెద్ద ఎదురుదెబ్బనే చెప్పాలి.




సిద్దిపేట : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంప్ కార్యాలయం వద్ద కొద్దిసేపు టెన్షన్ వాతావరణం నెలకొంది. గజ్వేల్‌లోని కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం ఉదయం ఆందోళనకు దిగారు. కేసీఆర్ క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ కార్యకర్తలు యత్నించారు. ఆపై కళ్యాణ లక్ష్మీ , షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేయాలని కేసీఆర్ చిత్రపటానికి వినతి పత్రం అందజేశారు. వెంటనే కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశారు.

**కేసీఆర్ కనబడుటలేదంటూ..**కాగా.. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కనిపించడం లేదంటూ గజ్వేల్‌లోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైన విషయం తెలిసిందే. కేసీఆర్ కనిపించడం లేదంటూ టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు ఈ ఫిర్యాదు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ఆచూకీ తెలుసుకుని నియోజకవర్గ ప్రజల ముందుకు తీసుకు రావాలని పోలీసులకు చేసిన ఫిర్యాదులో స్పష్టం చేశారు.



## 2029లో భాజపా, కాంగ్రెస్ మ్యాజిక్ ఫిగర్‌కు దూరమే!

హైదరాబాద్: హరియాణా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కొన్ని అంశాలు స్పష్టంగా తెలిశాయన్నారు. 2029లో భాజపా, కాంగ్రెస్ మ్యాజిక్ ఫిగర్‌కు దూరంగా ఉంటాయని.. తదుపరి కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలే కీలకమవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. దశాబ్దం, అంతకంటే ఎక్కువ కాలమే ఈ పరిస్థితి కొనసాగొచ్చు అంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "గ్యారంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. కాంగ్రెస్ గ్యారంటీలు అబద్ధమని హరియాణా ప్రజలు విశ్వసించారు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## విద్యుత్ శాఖలో ఉద్యోగాలకు త్వరలో భారీ నోటిఫికేషన్: భట్టి



హైదరాబాద్: విద్యుత్ శాఖలో ఉద్యోగాల భర్తీకి త్వరలోనే భారీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ భర్తీ చేస్తామన్నారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యుత్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "పదేళ్లుగా నిలిచిన పదోన్నతులను ఇప్పటికే పూర్తి చేశాం. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజలు 1912 నంబర్‌కు కాల్ చేయండి" అని సూచించారు. "ఇటీవల వరదలకు నష్టపోయిన ప్రజలను ఆదుకొనే చర్యలు చేపట్టాం. వరదల సమయంలో శ్రమించిన విద్యుత్ సిబ్బందికి అభినందనలు. ఫీజు రీయంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేస్తాం. దసరా కంటే ముందుగానే పెండింగ్ బకాయిలు విడుదల చేస్తాం" అని తెలిపారు.



# రేవంత్ దూకుడు...

## బలమా.. బలహీనతా...!?

## తెరవెనుక ఏం జరుగుతోంది?

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మాటలు కోటలు దాటుతున్నాయి. నేతలు నిగ్రహం కోల్పోతున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు ఇంకా తాము ప్రతిపక్షంలోనే ఉన్నామన్నట్లు వ్యవహరిస్తుండగా, అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ నేతలు తాము ఇంకా అధికారంలో ఉన్నామన్న భావనలోనే అహంకా రపూరితంగా మాట్లాడుతున్నారు. ఈధోరణి అధికార పార్టీ నేతల్లో మరింత అసహనం పెంచుతోంది. అధికారంలో లేకపోయినా అధికా రంలో ఉన్న నేతలను దూషించడాన్ని సహించలేకపోతున్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డే ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నేతలను అటాక్ చేస్తున్నారు. విపక్షంలో ఉన్నపట్టిలాగే దూకుడు ప్రదర్శిస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును తన పదునైన మాటలతో చీల్చి చెండాడుతున్నారు. అధికారం చెప్పట్టినప్పటి నుంచి ఇదే దూకుడు కొనసాగిస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ తన ప్రభుత్వాన్ని పడగొట్టి మళ్లీ అధికారంలోకి వస్తామని బెదిరించడంతో ముందుగా బీఆర్‌ఎస్ పార్టీనే సగం ఖాళీ చేసేసి కేసీఆర్‌కు పెద్ద షాక్ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికలలో కూడా బీఆర్‌ఎస్ పార్టీని దెబ్బ కొడితేనే కేసీఆర్‌ని కట్టడి చేయగలమని గ్రహించి దెబ్బ తీసి, ఫామ్‌హౌస్‌లో నుంచి బయటకు రాకుండా కట్టడి చేశారు.

**అనేక ఎదురుదెబ్బలు తిని..** బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ ఉద్యమంతో రాజకీయంగా ఎదిగారు. అంతకుముందు రాజకీయాల్లో ఉన్నా... తెలంగాణ ఉద్యమమే కేసీఆర్‌కు గుర్తింపు తెచ్చింది. ముఖ్యమంత్రిని చేసింది. ఇక రేవంత్‌రెడ్డి కూడా రాజకీయాల్లో అంత సుఖమైన ప్రయాణం సాగించలేదు. అనేక డక్కీమొక్కీలు తిన్నారు. టీడీపీలో ఓటుకునోటు కేసు.. కాంగ్రెస్ పార్టీలో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటూ ముఖ్యమంత్రి స్థాయికి వచ్చారు.

శ్రీరాముడు వానర సైన్యంతో మహా శక్తిశాలి అయిన రావణుడిని వదించిన్నట్లే, తన మాట అసలు వినని వానర సైన్యం వంటి కాంగ్రెస్ నేతలను వెంటబెట్టుకొని రేవంత్ రెడ్డి, రాజకీయాల్లో అపర చాణక్యుడని పేరు గుర్తింపు ఉన్న కేసీఆర్‌ను ఎన్నికల్లో ఓడించారు. పామ్‌హౌస్‌కు పరిమితం చేశారు.

**ఆ ఇద్దరూ కొరకరాని కొయ్యలా..** కేసీఆర్ అంతటివాడిని రేవంత్ రెడ్డి ఓడగొట్టారనే విషయం మరిచిన కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ సీఎం రేవంత్‌రెడ్డికి కొరకరాని కొయ్యలా తయారయ్యారు. ముప్పు తిప్పలు పెడుతున్నారు. సబ్జెక్ట్, లెక్కల ఆధారంగా రేవంత్‌రెడ్డిని బలహీనపర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రేవంత్ రెడ్డికి కావలసింది కూడా అదే. లేకుంటే ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యల జాబితా కొండంత ఉంది. కేటీఆర్, హరీశ్‌రావుతో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు పోరాటాలు చేస్తూ ప్రజల దృష్టిని సమస్యలపై నుంచి మళ్లిస్తున్నారు. ఇక కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు రాకపోయినా, రేవంత్ రెడ్డి దూకుడు, వ్యూహాలను, వైఫల్యాలను నిశితంగానే గమనిస్తున్నారు. కవిత జైలు నుంచి బయటకు వచ్చేశాక కేసీఆర్ కూడా ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి రేవంత్ రెడ్డి దూకుడుకి చెక్ పెడతారని తెలుస్తోంది. ఆ ప్రయత్నంలోనే కేసీఆర్ బీజేపీ పెద్దలతో తెర వెనుక రాయబారాలు నడుపుతున్నారని రేవంత్‌రెడ్డి స్వయంగా ఆరోపిస్తున్నారు. అంటే కేసీఆర్ వలన ప్రమాదం పొంచి ఉందని రేవంత్ రెడ్డి కూడా గ్రహించిన్నట్లు భావించవచ్చు. అందుకే కాంగ్రెస్ మంత్రులు కోరుకుంటున్న స్వేచ్ఛ, గౌరవం, ప్రాధాన్యత ఇస్తూ రేవంత్ రెడ్డి ఎవరూ పక్క చూపులు చూడకుండా జాగ్రత్తపడుతున్నారు.

**బీజేపీ–బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనేలా..** బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు చేతులు కలిపినా ఎదుర్కొనేలా రేవంత్‌రెడ్డి వ్యూహ రచన చేస్తున్నారు. అయితే అది అంత ఈజీ కాదంటున్నారు నిపుణులు. అందుకే ఇద్దరూ కలవకూడాదనే తరచూ కుమ్మక్కు ఆరోపణలు చేస్తున్నారు. ఒకవేళ కలిస్తే అప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సహకారం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయం కూడా రేవంత్ రెడ్డి చాలా ముందే పసిగట్టారని చెప్పవచ్చు.

అందుకే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే అభినందనలు తెలిపి విభజన సమస్యలపై చర్చలకు ఆహ్వానించారని అనుకోవచ్చు. తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి ఉండటం చంద్రబాబు నాయుడుకి ఎంత ముఖ్యమో, అదేవిదంగా ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడుగా ఉండటం రేవంత్‌రెడ్డికి కూడా అంతే అవసరం. అప్పుడే వారు తమ ఉమ్మడి శత్రువులు జగన్, కేసీఆర్‌ను కట్టడి చేయగలుగుతారు. అందుకే రేవంత్ రెడ్డి కాస్త దూకుడుగానే ముందుకు సాగుతున్నారు. ఈ దూకుడు, వ్యూహాలు, అప్రమత్తం మాత్రమే సరిపోదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, సమస్యలు తీర్చడం కూడా చాలా అవసరం.

గరుడ వార్త



# సంపాదకీయం

## బీఆర్ఎస్‌కు కొత్త నాయకత్వం అవసరమా..?
## కేడర్ అదే కోరుకుంటున్నదా..?

తెలంగాణ రాష్ట్ర ఉద్యమం క్రమంలో టీఆర్ఎస్ అంటే ప్రజలకు ఓ సెంటిమెంట్.. ఓ భరోసా. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఊరూరా గులాబీ జెండాలను ఎగురవేశారు. కేసీఆర్ నేతృత్వంలో పుట్టుకొచ్చిన పార్టీని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు అక్కున చేర్చుకున్నారు. పెద్దమొత్తంగా ఆదరించారు. అలా.. తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీకి తిరుగులేకుండా పోయింది. ఉద్యమపార్టీ నుంచి రాజకీయ పార్టీగా మారిపోయినప్పటికీ ప్రజల నుంచి ఆదరణ మాత్రం కోల్పోలేదు. దాదాపు దశాబ్ద కాలానికి పైగా తెలంగాణ రాష్ట్రంలో ఓ స్థాయిలో పార్టీ ఎదిగిపోయింది. తిరుగులేని శక్తిగా మారింది. మధ్యలో టీఆర్ఎస్‌ను కాస్త బీఆర్ఎస్ పార్టీగా మార్చినప్పటికీ ప్రజలు మద్దతుగా నిలుస్తూ వచ్చారు. అలా.. పదేళ్లపాటు పార్టీని ఆదరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు.. ఏర్పాటు అనంతరం కూడా గులాబీ పార్టీని తమ పార్టీగా భావించి గెలిపించుకున్నారు. రాష్ట్ర ఉద్యమం సందర్భంలో గులాబీ పార్టీ నేతలు ఎన్నిసార్లు రాజీనామాలు చేసి మరోసారి బరిలోకి దిగినా సెంటిమెంటును తెలుపుతూ గెలిపించుకుంటూ వచ్చారు. దాంతో ఏ ఎన్నికల్లోనూ ఆ పార్టీ ఓటమిని చూసింది లేదు. అసెంబ్లీ నుంచి మొదలుకొని.. పార్లమెంట్, లోకల్ బాడీ ఎలక్షన్స్ ఎందులో చూసినా గులాబీ జెండాలే రెపరెపలాడాయి. ఇక.. రాష్ట్ర ఏర్పాటు అనంతరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనూ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీనే ఆదరించారు ప్రజలు. దాంతో మొదటి సారి కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అలా ఐదేళ్లపాటు పాలన సాగించగా.. మరోసారి వచ్చిన ఎన్నికల్లోనూ కేసీఆర్‌నే ప్రజలు గెలిపించారు. దాంతో రెండు పర్యాయాలు కేసీఆర్ ముఖ్యమంత్రిగా కొనసాగారు. కేసీఆర్ నాయకత్వంలోని పార్టీ బీఆర్ఎస్ దశాబ్దకాలంపాటు ఎటువంటి ఎదురులేకుండా దూసుకెళ్లింది. అయితే.. పార్టీకి ముందు నుంచీ కేసీఆరే అధ్యక్షుడిగా కొనసాగుతూ వస్తున్నారు. వర్కింగ్ ప్రెసిడెంటుగా కేటీఆర్ కొనసాగుతున్నారు. పది నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్ఎస్ పార్టీ పాలైంది. దాంతో అప్పటి నుంచి పార్టీ అధినేత కేసీఆర్ ప్రజల్లోకి వచ్చింది లేదు. కేవలం ఫామ్‌హౌజ్‌కే పరిమితం అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఘోర ఓటమిని చవిచూసింది. కనీసం ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోయింది. అయినప్పటికీ కనీసం పార్టీ నాయకత్వంతో అధినేత చర్చించిన దాఖలు లేవు. ఓటమికి గల కారణాలను వెతికిందీ లేదు. నాయకత్వంతో సమావేశం అయింది కూడా లేదు. ఇక.. అధినేత పరిస్థితి అలా ఉంటే.. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయి కేటీఆర్ వైఖరి మరోలా ఉందని ఆ పార్టీ కేడర్‌లో టాక్. రాష్ట్రంలో కీలక సమయాల్లో ఆయన ఫారిన్ టూర్ వెళున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కౌశిక్ వివాదం జరిగినప్పుడు ఆయన అందుబాటులో లేరు. అలాగే.. హైడ్రా సమయంలోనూ లేరు. ఈ రెండింటి విషయాల్లోనూ హరీశ్ రావు లీడ్ తీసుకున్నారు. కేటీఆర్ కేవలం ట్విట్టర్ మెస్సేజ్ వరకే పరిమితం అయ్యారు. అటు ఖమ్మంలో వచ్చిన వరదల నేపథ్యంలోనూ బీఆర్ఎస్ లీడర్లు కనిపించలేదు. ఇక మూసీ వివాదం ఇంత పెద్ద స్థాయిలో కొనసాగుతున్నప్పటికీ.. ఇంతవరకు కేసీఆర్ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. వీటన్నింటి నేపథ్యంలో కేడర్ తీవ్ర నైరాశ్యంలో ఉన్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ ఫామ్‌హౌజ్‌ను వీడి వచ్చేది లేదని.. కేటీఆర్ నుంచి సరైన సమయంలో స్పందన ఉండడం లేదని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో నాయకత్వాన్ని మారిస్తేనే పార్టీకి పూర్వవైభవం వస్తుందని టాక్ నడుస్తోంది. ప్రెసిడెంట్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలను వేరే వాళ్లకి అప్పగిస్తే మరోసారి గులాబీ హవా కొనసాగుతుందని.. లేదంట భవిష్యత్ మరింత అంధకారమే అవుతుందన్న పుకార్లు షికారు చేస్తున్నాయి.

# అంబరాన్ అంటిన బతుకమ్మ సంబరాలు





శామీర్ పేట, (గరుడ వార్త) : తూంకుంట మున్సిపల్లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. మంగళవా రం తూంకుంటలోని మొగుళ్ళ వెంకట్రెడ్డి ఫంక్షన్ హాల్లో కమీషనర్ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు, మున్సిపల్ మహిళా అధికారులు, సిబ్బంది భారీ సంఖ్యలో బతుకమ్మ సంబరాలను ఎంతో ఉత్సాహాంగా జరుపుకున్నారు. ఈ సంబరాల్లో మహిళలు తెలంగాణ సంస్కతిని ప్రతిభింబించేలా అత్యంత ఆనందోత్సవలతో బతుకమ్మ పాటలను పాడుతు ఆటలు ఆడారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఈ వేడుకలు నిర్వహించారు. అధికారులకు, సిబ్బందికి మహిళలు కృతజ్ఞత లు తెలిపారు. ఈ బతుకమ్మ సంబరాలలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలను కమీషనర్ వెంకటగోపాల్, చైర్మన్ రాజేశ్వర్ రావు లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, నాయకులు, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, డ్వాక్రా మహిళలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ

**శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళ వారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మండలం కేంద్రం శామీర్ పేట కు చెందిన డీజీ వెంకటేష్ గౌడ్–దుర్గా భవాని దంపతులు, గడియారం మురళీధర్ శర్మ కుటుంబ సభ్యులు, గాండ్ల శివకుమార్ – లావణ్య దంపతులు, వారి కుటుంబ సభ్యులు, శామీర్ పేట గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.**





# సర్కారు వైద్యం తో భరోసా



సంగారెడ్డి : పల్లెలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా డెంగీ బాధితులే కనిపిస్తున్నారు. వైద్యానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఈ నెలలో 25 రోజుల్లోనే 116 డెంగీ కేసులు నమోదయ్యాయి. సంఖ్యా పరంగా రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత జిల్లా రెండో స్థానంలో ఉంది. పరిస్థితి భయపెడుతున్నప్పటికీ.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యారోగ్యశాఖ రోగులకు భరోసా కల్పిస్తోంది.

**టీ హబ్‌కు నమూనాలు**

డెంగీ నిర్ధారణ కోసం జిల్లాలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త నమూనాలు సేకరించి జిల్లా కేంద్రంలోని తెలంగాణ రోగ నిర్ధారణ కేంద్రం(టీ హబ్)కు పంపిస్తున్నారు. అక్కడ ఎలీసా కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించి ఫలితాలను వెంటనే సంబంధిత రోగుల చరవాణులకు సందేశం రూపంలో పంపిస్తున్నారు. వాటి ఆధారంగా రోగులు పీహెచ్‌సీలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందవచ్చు. ప్రైవేటుకు వెళ్లి డబ్బులు నష్టపోవద్దని వైద్యారోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

**అత్యధికం అందోలులో..**

గతేడాది సంగారెడ్డి, సదాశివపేట, రామచంద్రాపురం, పటాన్‌చెరు పట్టణాల్లో అత్యధికంగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈసారి అందోలు నియోజకవర్గంలోని పల్లెలు, పట్టణాలు డెంగీతో వణుకుతున్నాయని వైద్యారోగ్యశాఖ అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జులైలో 31 కేసులు కేవలం జోగిపేట ఆసుపత్రి పరిధిలోనే నమోదయ్యాయి. ఆగస్టులోనూ ఇదే పరిస్థితి.

**అప్రమత్తంగా ఉన్నాం..**

డెంగీ కేసుల్లో రాష్ట్రంలో జిల్లా ద్వితీయ స్థానంలో ఉండటంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమయింది. ఎక్కడైనా డెంగీ కేసులు నమోదయితే వెంటనే అక్కడ అందరికీ పరీక్షలు చేపట్టి మందులు అందజేస్తున్నాం. డెంగీ వల్ల భయపడాల్సిన అవసరం లేదు. అలాగని నిర్లక్ష్యం చేయవద్దు. మందులు, కిట్ల కొరతలేదు. సంగారెడ్డిలోని టీ–హబ్ ద్వారా 24 గంటల్లో డెంగీ పరీక్షలు చేసి ఫలితాలు అందజేస్తున్నాం. ప్రతి ఒక్కరు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పాత టైర్లు, కొబ్బరి బొండాలను పడేయాలి. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాలి. –గాయత్రీదేవి, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి.

**ప్రైవేటులో అధిక వసూళ్లు** ప్రైవేటు దవాఖానాల్లో డెంగీ నిర్ధారణ కోసం రూ.800 నుంచి రూ.1000 వరకు రుసుము వసూలు చేస్తున్నారు. కొన్ని ఆసుపత్రులు రోగుల ప్లేట్‌లెట్లు పడిపోయాయని అధిక మొత్తం వసూలు చేస్తున్నాయనే విమర్శలూ ఉన్నాయి. అందుకే ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# గుత్తేదారు నిర్లక్ష్యం... ముందుకు సాగని పనులు

ఆలేరు : మండు వేసవిలో సైతం నిండి ఆయకట్టు కింద రెండు పంటలకు (ఖరీఫ్, రబీ) సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరందిస్తూ, దిగువన మూడు చెరువులను నింపుతూ.. మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి కల్పించే శాలిగౌరారం ప్రాజెక్టు శిథిలావస్థలో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులకు గాను ప్రస్తుతం 16 అడుగులకు చేరింది. ఈ సీజన్‌కు వారం రోజుల కింద ఆయకట్టుకు సాగునీరు విడుదల చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసేందుకు గత ప్రభుత్వం రూ.5.10 కోట్లను మంజూరు చేసి పనులు ప్రారంభించింది. సంబంధిత గుత్తేదారు చెరువు కట్ట మీద మట్టిపోసి చేతులు దులుపుకొన్నారు. ఆ మట్టి కూడా నాసిరకంగా పోయడంతో ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయి కోతకు గురైంది. పనులు పూర్తిచేయడానికి ఇచ్చిన గడువు ఏడాది క్రితమే పూర్తయింది. అయినా ఇప్పటికీ 70 శాతం పనులు చేయాల్సి ఉంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..**

**సత్యనారాయణ, డీఈ, ఐబీ**

ప్రాజెక్టు మరమ్మతులకు రూ.5కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పినా గుత్తేదారు నిర్లక్ష్యం వీడటంలేదు. కాల్వ పనులు కూడా సక్రమంగా చేయలేదు. ఈ



విషయంపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సంబంధిత గుత్తేదారుకు నోటీసులు జారీ చేశాం. ప్రాజెక్టును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

**చేయాల్సిన మరమ్మతులు..**

ప్రాజెక్టు కట్టపై కంపచెట్లు తొలగించి, మట్టిపోసి కట్టను పటిష్టం చేయాలి పల్లివాడ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు వరకు గల రాచకాల్వకు మరమ్మతులు చేసి, శుభ్రం చేయాలి

రాచకాల్వపై మూడు ఎస్ఎల్ఆర్ బ్రిడ్జిలు నిర్మించి, కాల్వకు ఇరువైపులా బలహీనంగా ఉన్న కట్ట వద్ద సీసీతో రక్షణ గోడలు నిర్మించాలి.

ప్రాజెక్టు కుడి కాల్వ ఆరు కిలోమీటర్ల మేర శుభ్రం చేసి చివరి భూములకు సాగునీరందించాలి.

చేసినవికట్టపై ఉన్న కంపచెట్లను పూర్తిస్థాయిలో తొలగించలేదు. నామమాత్రంగా మట్టిపోయడంతో వర్షానికి కొట్టుకుపోయి కోతకు గురైంది.రాచకాల్వ 13 కి.మీ మేరకు మాత్రమే శుభ్రం చేశారు. కాల్వ నిండా కంపచెట్లతో అధ్వానంగా తయారైనా పూర్తిస్థాయిలో పనులు చేయకుండా వదిలేశారు.ప్రాజెక్టు కట్టపై చెట్లు తొలగించి, తూతూ మంత్రంగా పోసిన మట్టికే గుత్తేదారు రూ.2కోట్ల వరకు బిల్లు తీసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

## రైతు వేదికల్లోకి ఎరువులొచ్చేనా..?

ఆలేరు : పంటల సాగులో ఆధునిక పద్ధతులను జోడిస్తూ విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. భిన్నమైన పంటల సాగు, భూసార పరీక్షలు, ఎరువుల వినియోగంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన లేని పరిస్థితి. కర్షకులకు అధికారులు అందుబాటులో ఉండి మెలకువలు అందించాలనే ఉద్దేశంతో గత భారాస ప్రభుత్వం నల్గొండ ఉమ్మడి జిల్లాలో రూ.78.05 కోట్లు వెచ్చించి 314 రైతు వేదికలు నిర్మించింది. వీటిని ఎరువుల విక్రయ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించింది. అంతలోనే ఎన్నికలు రావడంతో అమల్లోకి రాకుండా పోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వేదికల్లోనే వ్యవసాయ శాఖాపరంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వీటితోపాటు మరిన్ని సేవలనూ అందుబాటులోకి తీసుకురావాలని అన్నదాతలు ఆశిస్తున్నారు.

**గత నిర్ణయాలు ఇలా..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంటల సాగుకు అవసరమైన ఎరువులను సగం మేర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), ఆగ్రోస్ కేంద్రాలు, డీసీఎంఎస్, హాకా సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే నిర్ణీత ధరలకు సరఫరా చేస్తోంది. మిగతా యాభైశాతం ఎరువుల విక్రయాలు ప్రైవేటు దుకాణాల ద్వారా సాగుతున్నాయి. రైతు వేదికల్లో వసతులు ఉండటంతో ఎరువులనూ విక్రయించాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏ క్లస్టర్ పరిధిలోని రైతులు అదే క్లస్టర్ రైతు వేదికల ద్వారా ఎరువులు తీసుకునేందుకు అనువుగా ఉంటుందని



భావించారు. ఇది విజయవంతమైతే విత్తనాలు కూడా విక్రయించడానికి సంసిద్ధంగా ఉన్నట్లు నాడు పాలకులు ప్రకటించారు. ఎరువుల నిల్వలు, భద్రత, రవాణా తదితర అంశాలను డీసీఎంఎస్‌లకు అప్పగించాలనుకున్నారు. ప్రభుత్వం మారిన క్రమంలో నాటి నిర్ణయాలు కార్యరూపం దాల్చలేదు. ఎరువులు, విత్తనాల విక్రయాలు, భూసార పరీక్షల జాడ లేకుండా పోయింది. కొన్ని చోట్ల రైతు వేదికలు తెరచుకోవడం లేదు. వేదికల నిర్వహణకు అందాల్సిన నిధులు సకాలంలో మంజూరు కాకపోతుండటంతో ఇవి అధికారులకు భారంగా మారింది.

**ఉమ్మడి జిల్లాలో**

**సాగు విస్తీర్ణం.. ఎరువుల అవసరం..**

| జిల్లా | రైతులు | రైతు వేదికలు | సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) | ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో) |
|---|---|---|---|---|
| నల్గొండ | 4,21,278 | 140 | 9,82,192 | 1,64,301 |
| సూర్యాపేట | 3,30,326 | 82 | 7,26,482 | 1,34,112 |
| యాదాద్రి | 1,57,206 | 92 | 6,65,000 | 80,954 |

# జలమండలి.. దసరా ధమాకా

హైదరాబాద్: జలమండలి దసరా దమాఖా ప్రకటించింది. నీటి బిల్లులు బకాయి పడ్డ వినియోగదారులకు మరోసారి వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం(ఓటీఎస్) అందుబాటులోకి తెచ్చింది. ఈ నెలాఖరు వరకు పథకం అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు పట్టణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. నీటి బిల్లుల బకాయిలను వినియోగదారులు ఎలాంటి ఆలస్య రుసుం, వడ్డీ లేకుండా ఈ స్కీం ద్వారా ప్రయోజనం పొందవచ్చు. కేవలం బిల్లులు ఒకేసారి చెల్లిస్తే సరిపోతుంది. గ్రేటర్ వ్యాప్తంగా ఇప్పటికే గృహ, ఇతర నల్లాల బకాయిలు రూ.1200 కోట్లకు చేరాయి. డివిజన్ 1 నుంచి 5 వరకు ఎక్కువ బకాయిలు పేరుకుపోయినట్లు తెలుస్తోంది. బకాయిలపై జలమండలి 18 శాతం వడ్డీ, ఆలస్య రుసుంలు విధిస్తోంది. గతంలో ఈ స్కీం ద్వారా రూ.600–700 కోట్లు ఖజానాకు చేరాయి. ఈ నేపథ్యంలో మరోసారి ఓటీఎస్‌తో బకాయిలపై వడ్డీ, రుసుం రాయితీలను అందిస్తోంది. వినియోగదారులు స్థానిక జలమండలి కార్యాలయాల్లో సంప్రదించాలని జలమండలి



ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు.

ఎవరు అర్హులంటే..

ఓటీఎస్ అక్టోబరు 31 వరకు మాత్రమే అమల్లో ఉంటుంది.

నల్లా కనెక్షన్ యాక్టివ్‌లో ఉన్న వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.

గతంలో ఓటీఎస్ పథకాన్ని వినియోగించుకోని వారు.. ఒకేసారి బిల్లు మొత్తం చెల్లిస్తే...ఆలస్య రుసుం, వడ్డీ మాఫీ అవుతాయి.

గతంలో ఈ స్కీం ద్వారా ప్రయోజనం పొందిన వారికి ఆలస్య రుసుం, వడ్డీలో 50 శాతం వరకు మాఫీ చేస్తారు.

ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందాలనుకునే వారు.. భవిష్యత్తులో రెండేళ్లపాటు క్రమం తప్పకుండా నీటి బిల్లులు చెల్లిస్తామని జలమండలికి అఫిడవిట్ ఇవ్వాలి.

ఒకవేళ భవిష్యత్తులో బిల్లులు చెల్లించకపోతే.. ఈ పథకం ద్వారా పొందిన ప్రయోజనాన్ని రద్దు చేస్తారు. తిరిగి బిల్లులు మొత్తం వడ్డీ, ఆలస్య రుసుంతో చెల్లించాలి.

మేనేజర్ స్థాయిలో రూ.2000, డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.2000 నుంచి 10 వేల వరకు, జీఎం స్థాయిలో రూ.లక్ష వరకు, సీజీఎం రూ.లక్షకు పైన మాఫీ చేసే అధికారం ఉంది.

# మీటర్లు లేని ఇళ్లు 23 వేలు

మెదక్: గృహజ్యోతి పథకం అమలుతో వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్తు సరఫరాపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆదాయంపైనా దృష్టి పెట్టింది. విద్యుత్తు మీటర్లు లేని వారిని గుర్తించి... వారిని సైతం గృహజ్యోతి పథకంలో చేర్చేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఈ విషయమై సంస్థ సీఎండీ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడుతారు. పరిశ్రమలు, మరోవైపు గృహ అవసరాలకు 24 గంటల పాటు విద్యుత్తును సరఫరా చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గృహజ్యోతి పథకంలో భాగంగా 200యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించే వారికి ఉచితంగా సరఫరా చేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 1.24 లక్షల మంది వినియోగదారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇంకా పలువురికి గృహజ్యోతి అమలుకాకపోవడంతో ప్రభుత్వం ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. పలువురు అర్జీలు ఇవ్వడంతో ప్రతినెలా వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది.

ఆదాయం కోల్పోతూ..

జిల్లాలో పలుచోట్ల కరెంటు తీగలకు కొండీలు వేసి అక్రమంగా విద్యుత్తు పొందుతున్నారు. అధికారులు తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నా



మార్పురావడం లేదు. ఈ క్రమంలో అధికారులు జిల్లాలో విద్యుత్తు మీటర్లు లేని గృహాలను గుర్తించారు. గతంలో కొందరికి మీటర్లు ఉండగా... మరికొందరికి లేవు. అలా మీటర్లు లేని ఇళ్లు 23,000 ఉన్నాయి. కానీ ఇళ్లకు మాత్రం విద్యుత్తు సరఫరా అవుతోంది. దీంతో ట్రాన్స్‌కో ఆదాయం కోల్పోతోంది. మరోవైపు మీటర్లు లేకపోవడంతో వీరు గృహజ్యోతి పథకం కిందకు రావడం లేదు. అటు ఆదాయం వచ్చేలా.. ఇటు పక్కగా మీటర్లు పొందేలా సంస్థ చర్యలు చేపట్టనుంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,650, పట్టణ ప్రాంతాల్లో రూ.3,300 చెల్లిస్తే మీటర్లు బిగించనున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

– శంకర్, ట్రాన్స్ కో ఎస్ఈ

జిల్లాలో మీటర్లు లేని ఇళ్లు 23 వేలు ఉన్నాయి. ఈనెల 15 వరకు సర్వే పూర్తి చేస్తాం. మీటర్ లేని వారు దరఖాస్తు చేసుకోవాలి. వారు 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగిస్తే గృహజ్యోతి పథకానికి అర్జీ పెట్టుకుంటే జీరో బిల్లు వస్తుంది.

జిల్లాలో ఇలా..

గృహ కనెక్షన్లు 2,07,643

గృహజ్యోతి లబ్ధిదారులు: 1,24,000

రాయితీ రూ.23 కోట్లు

# సాగులో సలహాలు అందేదెలా..?



ఎల్లారెడ్డిపేట: వ్యవసాయశాఖను అధికారులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇటీవల బదిలీల్లో ఇక్కడ పనిచేసిన వారంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడంతో ఆయా పోస్టుల్లో ఖాళీలేర్పడ్డాయి. ప్రధానంగా మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారుల కొరత నెలకొంది. ఒక్కో ఏవో రెండు నుంచి మూడు మండలాలను పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యవసాయ విస్తరణాధికారులదీ అదే పరిస్థితి.

13 మండలాలు.. ఆరుగురు ఏవోలు

జిల్లాలో 4,72,329 ఎకరాల భౌగోళిక విస్తీర్ణం ఉండగా.. 2,90,380 ఎకరాల భూమి సాగుకు అనుకూలంగా ఉంది.

రైతుబంధు లెక్కల ప్రకారం 1,34,725 మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు.

ఈ ఏడాది వరి 1,80,310 ఎకరాలు, పత్తి 49,332 ఎకరాలు, మొక్కజొన్న 56.26 ఎకరాలు, పెసర 439.8 ఎకరాలు, కంది 162.05 ఎకరాలతోపాటు ఇతర పంటలను రైతులు సాగుచేశారు.

జిల్లాలో 13 మండలాలకు ప్రస్తుతానికి ఆరుగురు మండల వ్యవసాయాధికారులు మాత్రమే ఉన్నారు.

సిరిసిల్ల, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, వేములవాడ, బోయినపల్లి, చందుర్తి మండలాల్లో ఏవోలు పనిచేస్తుండగా మిగితా మండలాల్లో ఏవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

రైతులకు సత్వర సేవలందించాలనే ఉద్దేశంతో ప్రతి 5 వేల మంది రైతులకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 57 క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో క్లస్టర్ పరిధిలో ఒక వ్యవసాయ విస్తరణాధికారి సేవలందించాల్సి ఉంటుంది.

మొత్తం 57 ఏఈవో పోస్టులకు 49 మంది పని చేస్తున్నారు. వీరిలోనూ 10 మంది పొరుగుసేవలపై విధులు నిర్వరిస్తున్నవారే కావడం గమనార్హం.

ఇద్దరు ఏఈవోలు ప్రస్తుతానికి సెలవులో ఉన్నారు.

రుద్రంగి, గంభీరావుపేట, ఆవునూరు, వీర్నపల్లి, అల్మాస్‌పూర్, రాచర్ల గొల్లపల్లి క్లస్టర్ల పరిధిలో ఏఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కృష్ణవేణి, మహేశ్వరి ఏవో (సాంకేతిక)లుగా పనిచేస్తుండగా మరో ఏవో టెక్నికల్ పోస్టుతోపాటు ఒక సీనియర్ అసిస్టెంటు పోస్టు ఖాళీగా ఉన్నాయి.

పెరుగుతున్న భారం

ఏవోలు ఫర్టిలైజర్, ఎరువులు, విత్తనాల దుకాణాలను నిత్యం తనిఖీ చేస్తూ ఎలాంటి కల్తీ జరగకుండా నమూనాలను ప్రయోగశాలకు పంపించాలి. కొత్త వంగడాలు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలి. రైతు వేదికల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ పంట యాజమాన్య పద్ధతులపై సలహాలు, సూచనలు అందించాలి. ఏఈవోలను పర్యవేక్షించాలి. ఉన్నతాధికారులతో సమావేశాలు, టెలీకాన్ఫరెన్స్‌లలో పాల్గొని క్షేత్రస్థాయిలో ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లాలి. ఏఈవోలు రైతులు వేసిన పంటల వివరాలను నమోదు చేయాలి. రుణమాఫీ, రైతు బీమా, రైతుబంధు పథకాల్లో రైతుల వివరాలను సేకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టాన్ని అంచనా వేసి, నివేదికలు సమర్పించాలి. రైతులకు అందుబాటులో ఉంటూ సాగులో మెలకువలపై అవగాహన కల్పించడంతోపాటు ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ ఉద్యోగ కర్తవ్యాన్ని నెరవేర్చాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ఏవోలు, ఏఈవోల పోస్టుల ఖాళీలతో పలు మండలాల్లో ఇన్‌ఛార్జిలుగా కొనసాగుతున్నారు. దీంతో అధికారులపై పని ఒత్తిడిభారం పడుతోంది. అధికారులు, సిబ్బంది కేటాయింపులో జిల్లాకు ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వానికి నివేదించినట్లు జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం తెలిపారు.

# ఇంటింటి చెత్త సేకరణపై నిఘా



హైదరాబాద్: పారిశుద్ధ్య విభాగాన్ని గాడిలో పెట్టడంపై జీహెచ్‌ఎంసీ దృష్టిపెట్టింది. సాంకేతికతను ఉపయోగించుకుని ఇంటింటి చెత్త సేకరణను పకడ్బందీగా చేపట్టేందుకు కసరత్తు ప్రారంభించింది. రెండు, మూడు రోజులకు గానీ స్వచ్ఛ ఆటోలు చెత్తను తీసుకుపోవట్లేదని అన్ని డివిజన్ల నుంచి జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో.. లోటుపాట్లను సరిదిద్దాలని కమిషనర్ ఆమ్రపాలి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) పేరుతో నిఘా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆమేరకు ఘన వ్యర్థాల నిర్వహణ విభాగం ఈఓఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్) టెండరు ప్రక్రియను పూర్తి చేసి.. కన్సల్టెన్సీ ద్వారా, ఆస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) సాయంతో అధ్యయనాన్ని చేపట్టింది. త్వరలో సర్వే నివేదిక అందుతుందని, అనంతరం పూర్తిస్థాయి ప్రణాళికను (డీపీఆర్) రూపొందించి, కంట్రోల్ రూము, మొబైల్‌యాప్‌ను ఏర్పాటు చేయనున్నారు. సమస్యలపై అధ్యయనం.. నగరంలో 25లక్షల ఇళ్లు ఉన్నాయి. వాటి నుంచి రోజూ చెత్తను సేకరిస్తే.. వీధుల్లో చెత్త కుప్పలు దాదాపు కనుమరుగవుతాయి. సగం మంది స్వచ్ఛ ఆటోల డ్రైవర్లు రోజూ చెత్త సేకరణకు వెళ్లట్లేదు. ఈ నేపథ్యంలో.. చెత్త సేకరణలో ఆటో కార్మికులకు ఎదురవుతోన్న సవాళ్లు, వారి వల్ల ప్రజలకు కలుగుతోన్న ఇబ్బందులు, ఇంటి చెత్తను రోజూ సేకరిస్తే.. వ్యాపార కేంద్రాల్లోని వ్యర్థాలను ఎవరు సేకరించాలి, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఉత్పత్తయ్యే చెత్తను ఏం చేయాలి, ఇలాంటి అనేక ప్రశ్నలకు సమాధానాలను గుర్తించేందుకు జీహెచ్‌ఎంసీ అధ్యయనం చేపట్టింది.

రోడ్లను కేటాయిస్తేనే..

జీఐఎస్ నగర పటాన్ని ఉపయోగించుకుని, గ్రేటర్ పరిధిలోని 150 డివిజన్లకు తమున్న 4,500 స్వచ్ఛ ఆటోలను పకడ్బందీగా కేటాయిస్తేనే పారిశుద్ధ్యం గాడిలో పడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రతి ఆటోకు కొన్ని రోడ్లను కేటాయించి, ఇళ్లకు రోజూ వెళ్తున్నాయా, లేదా అని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచిస్తున్నారు. ఇప్పటికే 4,300 స్వచ్ఛ ఆటోలకు జీపీఎస్ పరికరాలను అమర్చామని, ఐసీసీసీ, మొబైల్ యాప్ ద్వారా వాటిపై నిఘా ఉంచాలని, రవాణా వాహనాలకూ జీపీఎస్ పరికరాలను అమర్చాలని కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు.

# పండగ నాటికి పదవులొచ్చేనా..?



ఖమ్మం: రాష్ట్రవ్యాప్తంగా 78 మార్కెట్లకు పాలకవర్గాలు కొలువుదీరినా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని మరో పది మార్కెట్ల పదవులు కొలిక్కిరావటం లేదు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ఎంపిక ప్రక్రియ కొలిక్కిరాలేదు. దసరా నాటికైనా అన్ని మార్కెట్లకు పాలకవర్గాలను ప్రకటిస్తే.. తమకు పదవులొస్తాయని పలువురు ఆశిస్తున్నారు. ఇక రాబోయేది మార్కెట్ సీజన్ కావటంతో పాలకవర్గాలు కొలువుదీరాల్సిన అవసరం కనిపిస్తోంది.

ఆశావహుల పోటాపోటీ

ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మధిర, వైరా, నేలకొండపల్లి, మద్దులపల్లి, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు, భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలం, చర్ల, దమ్మపేటలో మార్కెట్ యార్డులున్నాయి. నేలకొండపల్లి, మద్దులపల్లి, కల్లూరు, సత్తుపల్లి మార్కెట్లకు ఇటీవల పాలకవర్గాలు కొలువుదీరాయి. ఖమ్మం, మధిర, వైరా మార్కెట్ ఛైర్మన్ పదవులు బీసీ జనరల్, ఏన్కూరు ఛైర్మన్ పదవి ఎస్టీ కోయ, భద్రాద్రి జిల్లాలోని మార్కెట్ల ఛైర్మన్ పదవులన్నీ ఎస్టీలకు దక్కనున్నాయి. ఆయా మార్కెట్ కమిటీల ఛైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం ఆశావహులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సు అవసరమవుతుండటంతో మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారికే పదవులు కట్టబెట్టాలని సీనియర్లు కోరుతుంటే.. 2023 శాసనసభ ఎన్నికలకు ముందు హస్తం గూటికి చేరిన నాయకులూ తమవంతు ప్రయత్నం చేస్తుండటంతో ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారింది. కొత్తగూడెం మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిపై మిత్రపక్షాలు కాంగ్రెస్, సీపీఐ కన్నేయటం గమనార్హం. అన్నదాతలకు దన్నుగా అనేకచోట్ల పాలకవర్గాలు కొలువుదీరకపోవటంతో పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు మార్కెట్ యార్డులకు వచ్చే అన్నదాతలకు ఇబ్బందులు తప్పటం లేదు. రైతులు, వ్యాపారుల మధ్య అనుసంధానకర్తగా వ్యవహరిస్తూనే కర్షకులకు గిట్టుబాటు ధర దక్కేలా చూడాల్సిన బాధ్యత మార్కెట్ పాలకవర్గాలపై ఉంటుంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఈనెలాఖరు నుంచే పత్తి రాక మొదలవుతుంది. ఆ తర్వాత మిరప వస్తుంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో విపణిలో క్రయవిక్రయాల పర్యవేక్షణకు పాలకవర్గం తప్పనిసరి. ఛైర్మన్ సహా పాలకవర్గం లేకపోతే.. ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు సాగుతాయన్న వాదన వినిపిస్తుంది. అదే జరిగితే కర్షకులకు గిట్టుబాటు ధర అందటం గగనంగానే మారుతుంది. అంతేకాకుండా ఖమ్మం మార్కెట్ ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఈ పనుల పర్యవేక్షణ సక్రమంగా సాగాలంటే పాలకవర్గం కొలువుదీరాల్సిన అవసరముంది. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత నియోజకవర్గమైన ఖమ్మంలో మార్కెట్ ఛైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనన్న ఆసక్తి నెలకొంది. అమాత్యుడి ఆశీస్సులు ఎవరికి ఉన్నప్పటికీ.. వీలైనంత త్వరగా పాలకమండలి కొలువుదీరితేనే అన్నదాతలకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# పక్కన చేరి.. ఘరానా చోరీ.. దృష్టిమరల్చి దోచేస్తారు!

హైదరాబాద్ : భార్యాభర్తలు.. అపరిచితులుగా వాహనాల్లోకి చేరి పక్కనే కూర్చుంటారు. అనుమానం రాకుండా ప్రయాణికుల విలువైన వస్తువులు కొట్టేసి క్షణాల్లో మాయమవుతారు. నగరంలో అంతర్రాష్ట్ర ముఠాలు దృష్టిమరల్చి చోరీలకు పాల్పడుతున్నాయి. సిటీబస్సులు, ఆటోలు, రైళ్లల్లో హల్‌చల్ చేస్తున్నాయి. కాజేసిన సొమ్మును రిసీవర్లకిచ్చి నగరం దాటిస్తున్నాయి. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా కేటుగాళ్లను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

శివార్లలో నివాసం మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి వెళ్లేందుకు ప్రైవేటు ఉద్యోగి సిటీబస్సు ఎక్కారు. టోలిచౌకి వద్ద ఇద్దరు యువకులు బస్సులోకి చేరారు. షేక్‌పేట్ దర్గా వద్దకు చేరగానే ఆ ఇద్దరూ దిగిపోయారు. గమ్యస్థానంలో దిగిన ఆ ఉద్యోగి తన జేబులో పర్సు, మెడలో గొలుసు మాయమైనట్టు గుర్తించాడు. బేగంపేట్ వద్ద ఆటోలో ప్రయాణించిన భార్యాభర్త చోరీకి పాల్పడినట్టు ఆటోడ్రైవర్ గుర్తించి ఫిర్యాదు చేశాడు. ఏపీ, దిల్లీ, హైదరాబాద్ ముఠాలు రెప్పపాటులో విలువైన వస్తువులు కాజేసి మాయమవుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఏపీలోని బాపట్ల, సత్తెనపల్లి, నగరంలోని మాంగార్‌బస్తీలకు చెందిన పురుషులు, మహిళలు ముఠాలుగా మారి ఇలా చేస్తున్నట్టు అంచనా. ఏపీ, యూపీ, తమిళనాడుకు చెందిన దొంగలు శివారు



ప్రాంతాల్లో ఇల్లు అద్దెకు తీసుకుంటారు. పగటి వేళల్లో ప్రయాణికుల్లా బస్సులు, మెట్రోరైళ్లు, ఎంఎంటీఎస్, రద్దీ ప్రాంతాల్లోకి చేరతారు.

కొట్టేయడంలో స్టైలే వేరు

తమిళనాడు ముఠాలు బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలు, ట్రాఫిక్ కూడళ్లను ఎంచుకుంటాయి. ఒంటిపై ఉమ్మిపడిందని, టైర్లలో గాలిపోయిందంటూ ఏమార్చి వస్తువులు కాజేస్తారు. ఏపీ చోరులు చిరువ్యాపారులు, గృహిణులను లక్ష్యంగా చేసుకుంటారు. తవ్వకాల్లో బంగారపు కడ్డీ దొరికిందని తక్కువ ధరకు ఇస్తామంటూ మోసగిస్తారు. యూపీ బ్యాచ్ ప్రయాణికులుగా నటిస్తూ చెంతన చేరతారు. దిల్లీ ముఠాలు డబ్బును ఎరగా వేస్తారు. విదేశీ కరెన్సీ ఉందని.. ఆశచూపుతారు. నగరంలోఈ తరహా ముఠాలు సుమారు 10 మందికి పైగా మోసగించినట్టు సమాచారం. ప్రజారవాణా, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించేటపుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# రైతన్నలకు రాయితీపై ఉపకరణాలు

గజ్వేల్: సాగు ఉపకరణాలపై రైతులకు ఇచ్చే రాయితీని పునరుద్ధరిస్తామని, ఇందుకు ఏటా రాష్ట్రంలో రూ.600 కోట్లు ఖర్చు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం గజ్వేల్‌లో ప్రకటించిన నేపథ్యంలో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. దీంతో జిల్లా రైతాంగానికి లబ్ధి చేకూరనుంది.

ఫాం మెకనైజేషన్ పథకంలో భాగంగా గత ప్రభుత్వం ట్రాక్టర్లను అందజేసి సాగు సామగ్రి(గోర్లు, నాగళ్లు, తదితర పరికరాలు )ని పూర్తిగా నిలిపివేసింది. ఫలితంగా చిన్న, సన్నకారు రైతులకు సాగు పరికరాలు అందలేదు. మూడు కాళ్ల నాగళ్లు, రొప్పు గొర్లు, చిన్న ఫ్లావ్, పెద్ద ఫ్లావ్, ఆఫ్ కేజీవీళ్లు(దుమ్ములు), మందు పిచికారీ డబ్బాలు గతంలో రైతులకు సగం ధరకే రాయితీపై అందుబాటులో ఉండేవి. చిన్న, సన్నకారు రైతులు వీటిని కొనుగోలు చేసి సమయానికి అనుగుణంగా సాగు పనులు చేసుకునేవారు.

బడ్జెట్‌లో కేటాయింపులు లేక..

బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం మూలంగా రైతులకు పరికరాలు అందుబాటులోకి లేకుండా పోయాయి. బీటీ రోడ్లు పాడవుతున్నాయన్న కారణంగా ఫుల్ దమ్ముచక్రాలను రద్దు చేసిన సర్కారు ఆఫ్ దమ్ముచక్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటిని సైతం రైతులకు అందుబాటులో ఉంచకపోవడంతో బయట పూర్తి ధరకు



కొనుగోలు చేస్తున్నారు.అవసరాలు మెండుగా...జిల్లాలో వానాకాలం, యాసంగి రెండు సీజన్లు కలిపి దాదాపు 8 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగు చేస్తుంటారు. ఇందులో పత్తి సాగు చేసే రైతులకు తప్పనిసరిగా మూడు కాళ్ల గొర్లు, కలుపు తీత దంతెలు అవసరం అవుతాయి. వరి నాటు వేసే సమయంలో నీరు పారేందుకు వినియోగించే రొప్పు గొర్లు అవసరం ఉంటాయి. ట్రాక్టర్లున్న రైతులకు ఆఫ్ దమ్ముచక్రాలు అవసరం ఉంటాయి. వీటి సరఫరా లేకపోవడంతో రైతులు నిట్టూర్చుతున్నారు. సొంతగా కొనుగోలు చేసి పెట్టుకున్న వారి వద్ద అద్దెకు తీసుకుంటున్నారు.

బయట రెట్టింపు ధరలకు విక్రయం

గొర్లకు విపరీతమైన డిమాండు ఉంది. ప్రభుత్వం రాయితీపై పరికరాలు ఇవ్వడం లేదని తెలిసి వ్యాపారులు మార్కెట్‌లో రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. రైతులకు సరిపడా పరికరాలు కావాలంటే జిల్లాకు ఏటా కనీసం రూ.30 కోట్ల మేర బడ్జెట్ అవసరం ఉంటుందని అంచనా. మొత్తంగా వ్యవసాయ ఉపకరణాలు రైతులకు రాయితీపై అందజేస్తామని మంత్రి చెప్పడంతో రైతులు స్వాగతిస్తున్నారు.

## అనగనగా అక్కడో చెరువుండే

హైదరాబాద్ : నగరంలోని చెరువులు అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఆక్రమణకు గురై కుంచించుకుపోతున్నాయి. కొన్నాళ్లయితే పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదమూ ఉంది. ఈ నేపథ్యంలో హైడ్రాపైనే జనం ఆశలు పెట్టుకున్నారు. అక్టోబరు, 2020లో కురిసిన వర్షాలకు నగరంలోని ఐదు లక్షల కుటుంబాలు నెల రోజులపాటు ముంపును ఎదుర్కొన్నాయి. అనంతరం జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లు, కంటోన్మెంట్ పరిధి, పలు కేంద్ర ప్రభుత్వ సంస్థల పరిధిలో చేపట్టిన అధ్యయనం ప్రకారం తటాకాల లోపల దాదాపు 15 వేల ఆక్రమణలు ఉన్నట్లు లెక్క తేలాయి.

గత నాలుగేళ్లలో మరో 5వేల ఆక్రమణలు ఉండొచ్చని అంచనా. మరో పదేళ్లలో అన్నీ చెరువులు కనిపించకుండా పోయే ప్రమాదము ందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆ నగరాలే ఆదర్శం.. బెంగళూరులో చెరువులను ఆక్రమణల నుంచి విడిపించి, పునరుజ్జీవం కల్పించే చర్యలు జరుగుతున్నాయి. చెన్నైలో



ఉపగ్రహ చిత్రాలతో ఆక్రమణలను గుర్తించే వ్యవస్థను తీసుకొచ్చారు. వాటిలోని ఉత్తమ విధానాలను అందిపుచ్చుకుని చెరువులను రక్షిస్తామని హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ చెబుతున్నారు.

ఇప్పటికీ కబ్జాలే..148 ఎకరాల మూసాపేట మైసమ్మ చెరువులో 58 ఎకరాలు ఆక్రమించారు. మరో పది ఎకరాల్లో సెల్లారు మట్టితో పూడ్చారు. హైటెక్‌సిటీ ఎన్ఐఏ రోడ్డులో 7 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న తమ్మిడికుంట కనిపించడం లేదు. కామునిచెరువు, ఐడీఎల్ చెరువు పదెకరాల మేర, సున్నం చెరువు సగం మేర ఆక్రమించారు.

జీహెచ్ఎంసీ సైతం లింకు రోడ్డు పేరుతో చెరువు మధ్యలో 100 అడుగుల రోడ్డు నిర్మించగా.. కొందరు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు నిర్మించారు. కాటేదాన్, రాజేంద్రనగర్, గాజులరామారం, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ప్రాంతాల్లో ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి.

## దశాబ్దాల మరక మార్పు కానరాక

హైదరాబాద్ : మత్తు దందా ఎక్కువ సాగే ప్రాంతం ఏది అంటే చాలామంది ధూల్‌పేట అని టక్కున సమాధానం చెబుతారు. ఈ మరకను తొలగించడానికి పోలీసులు, ఆబ్కారీ శాఖ ఆపరేషన్ ధూల్‌పేట కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఆబ్కారీ, పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తిగా గంజాయి దందా తుద ముట్టించడానికి కంకణం కట్టుకున్నారు.

చిక్కని అసలు వ్యక్తులు

ఇప్పటి వరకు 54 మందిని అరెస్టు చేశారు. మరో 53 మంది గంజాయి విక్రేతలు పరారీలో ఉన్నారు. ధూల్‌పేటకు గంజాయి చేర్చడంలో ప్రముఖంగా వ్యవహరించే వారిలో (ఒకరు మహిళ) ఇంకా చిక్కలేదు.

ఇది సరిపోదు..: ఆపరేషన్ ధూల్‌పేటతో నిందితులు అప్రమత్తమ య్యారు. అప్పటివరకు స్థానికంగా ఉండకుండా..వ్యాపారం చేయకుండా ఉండి.. ఆ తర్వాత మొదలెడుదామనే వ్యూహం స్పష్టంగా



కనిపిస్తోంది. ఈ విషయం అధికారులకు తెలిసినా ఆబ్కారీ పోలీసుల ప్రణాళిక పక్కాగా ఉన్నట్టు కనిపించడం లేదు.

ఇలాగైతే ఎలా..!ధూల్‌పేట ఆబ్కారీ స్టేషన్‌లో ముగ్గురు సీఐలకు ఇద్దరే ఉన్నారు. ఒకరికి పోస్టింగ్ ఇచ్చినా విధుల్లో చేరలేదు.

11 మంది ఎస్సైల్లో ఐదుగురు సెలవు పెట్టారు.

18 మంది కానిస్టేబుళ్లలో ముగ్గురు మహిళలు. 15 మందిలో ఇద్దరు ఎక్సైజ్ అకాడమీలో ఉన్నారు.

ఈ నెల 19 వరకు 99 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

## ఖర్చులన్నీ కట్టాల్సిందే

హైదరాబాద్ : రాజధానిలో చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పడిన హైడ్రా సరికొత్త ఎత్తుగడతో ముందుకు వెళ్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వానికి కలిగిన నష్టాన్ని నిర్మాణదారుల నుంచే వసూలు చేయాలనుకుంటోంది.

నిర్మాణ వ్యర్థాల తరలింపులో సవాలు.. హైడ్రా అధికారులు ఇప్పటికే 18 చోట్ల 166 నిర్మాణాలను నేలమట్టం చేశారు. కట్టడాలు కూల్చడంతో నిర్మాణ వ్యర్థాలు భారీగా పోగుపడుతున్నాయి. వీటిని తరలించడానికి రూ.కోట్లలోనే ఖర్చయ్యే అవకాశం ఉంది. కూల్చిన చెరువుల దగ్గర ఫెన్సింగ్ వేస్తేనే తిరిగి ఆక్రమణలు జరగవని స్థానికులు చెబుతున్నారు. కుంచించుకుపోయిన వాటిని పునరిద్ధరించాలంటే తవ్వకాలు జరిపి పూర్వ ఆకారాన్ని తీసుకురావాల్సి ఉంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో హైడ్రా దగ్గర ఆ స్థాయిలో నిధుల్లేవు. ప్రస్తుతం కూల్చిన 166 నిర్మాణ వ్యర్థాలను తొలగించడానికి ఏర్పాట్లు చేసినట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. కూల్చివేతకు ఇచ్చిన కాంట్రాక్టులో శిథిలాల తొలగింపు ఒక భాగంగా చేశామని తెలిపారు. ఆర్ఆర్ చట్టం కింద ఈ మొత్తం వ్యయాన్ని నిర్మాణదారుల దగ్గరే వసూలు చేసేలే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్‌ను రెండు రోజుల కిందట కూల్చివేసిన విషయం తెలిసిందే. ఇక్కడ దాదాపు చిన్నా పెద్దా పది నిర్మాణాలు ఉ న్నాయి. వీటిని కూల్చివేయడానికి భారీ యంత్రాలను వినియోగించారు. ఇప్పుడు ఇక్కడి నుంచి ఇనుప వస్తువులతో నిండి ఉన్న శిథిలాలను తొలగించడం కత్తి మీద సాములా మారింది.

# సీఎంఆర్ ధాన్యం ఏమైంది?



హుజూరాబాద్: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద ధాన్యాన్ని మరాడించి బియ్యాన్ని తిరిగి అప్పగించడంలో కొందరు మిల్లర్లు ముప్పు తిప్పలు పెడుతున్నారు. బియ్యమైనా తిరిగి ఇవ్వండి.. లేదా దానికి సరిపడా డబ్బులైనా చెల్లించాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా.. మిల్లర్లకు నోటీసులు జారీ చేస్తున్నా.. 2021-22లో బకాయి అప్పగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

1,31,262 క్వింటాళ్ల బియ్యం బకాయి

జిల్లాలో 2020-21 వానాకాలం, యాసంగి సీజన్లలో సుమారు 7,03,508 మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్ కింద కేటాయించారు. ధాన్యాన్ని మరాడించి ముడి బియ్యం క్వింటాకు 67 కిలోలు, బాయిల్డ్ బియ్యం క్వింటాకు 68 కిలోల చొప్పున తిరిగివ్వాలి కానీ.. నాలుగేళు పూర్తయినా ఆశించిన ప్రగతి లేదు. జిల్లాలో 58 మంది మిల్లర్లు తమకు కేటాయించిన 16,25,236 క్వింటాళ్ల ధాన్యాన్ని మరాడించి 10,81,900 క్వింటాళ్ల బియ్యం తిరిగివ్వాల్సి ఉంది. ఇప్పటివరకు 3,49,950 క్వింటాళ్ల బియ్యం మిల్లర్ల వద్దే ఉండిపోవడంతో పౌరసరఫరాల సంస్థ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. స్పందించకపోవడంతో 25 శాతం జరిమానాతో కలిపి 4,37,438 క్వింటాళ్ల బియ్యం తిరిగివ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. పలువురు మిల్లర్లు 3,06,176 క్వింటాళ్ల బియ్యాన్ని 100 శాతం తిరిగి అప్పగించారు. ఇంకా 43,774 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాల్సి ఉంది. దీనికి 25 శాతం జరిమానాతో కలిపితే 1,31,262 క్వింటాళ్ల బియ్యం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. జిల్లాలో సీఎంఆర్ బకాయి పడిన వారిలో 58 మంది మిల్లర్లు ఉన్నారు. వీరందరిని డిఫాల్టర్లుగా అధికారులు గుర్తించినా ఇందులో కొందరికి ఆ తర్వాతి సీజన్ల సీఎంఆర్ ధాన్యం కేటాయించడం గమనార్హం.

**మిల్లుల్లో నిల్వలేవీ?**

ఒక సీజన్‌లో సీఎంఆర్ కింద తీసుకున్న ధాన్యాన్ని మరాడించి మరో సీజన్ ధాన్యం వచ్చే సమయానికి కంటే ముందే బియ్యం తిరిగి అప్పగించాలి. 2021-22 వానాకాలం, యాసంగి సీజన్‌లు ముగిసి నాలుగేళ్లు పూర్తయినా వేలాది క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించడంలో మొండికేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం మిల్లర్ల వద్ద ధాన్యం లేకపోవడమే.. ఈ మేరకు హుజూరాబాద్‌కు చెందిన సత్యనారాయణ అనే వ్యాపారి మిల్లును లీజుకు తీసుకొని 2021-22 వానాకాలం సీజన్‌లో 3,870 క్వింటాళ్ల ధాన్యం, 2022-23 వానాకాలంలో 3,445 క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా మొత్తంగా రూ.2.50 కోట్ల విలువైన 5,753 క్వింటాళ్ల ధాన్యం మాయం చేశాడు. ఈ మేరకు కేసు కూడా నమోదు చేశారు. లీజుకు తీసుకున్న వ్యాపారి ఆచూకీ లేకపోవడంతో మిల్లు యజమాని సమ్మిరెడ్డికి నోటీసులు జారీ చేయడంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. లా 2021-22లో సీఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లర్లు మరాడించిన బియ్యాన్ని అమ్ముకొని సొమ్ము చేసుకోవడం వల్లే నాలుగేళ్లు దాటినా బకాయిలు తిరిగివ్వడం లేదని తెలుస్తోంది.

**యథేచ్ఛగా పక్కదారి..**

గత డిసెంబరులో టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంటలోని ఆరు మిల్లులను తనిఖీ చేశారు. 2022-23 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి సీఎంఆర్ కింద 5.41 లక్షల క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా 2.66 లక్షల క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.52.13 కోట్లు పైగానే ఉంటుంది. నిరంతరం తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే మిల్లుల్లోని సీఎంఆర్ ధాన్యం పక్కదారి పడుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదే అదనుగా మిల్లర్లు సీఎంఆర్ ధాన్యాన్ని యథేచ్ఛగా పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు.

# అతివలకు ఆర్థిక భరోసా



వికారాబాద్ : ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే అతివల కోసం ప్రత్యేకంగా 'ఇందిరా మహిళా శక్తి' పథకాన్ని ప్రారంభించింది. దీంతో మహిళలు అభివృద్ధి చెందడంతో పాటు మరో పది మందికి ఉపాధి కల్పించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టింది. రుణాలు సైతం అందజేయనుంది.

క్యాంటీన్లు 6

జిల్లాలోని నాలుగు పురపాలికల్లో 6 మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నారు. వికారాబాద్‌లో కలెక్టర్ కార్యాలయం, జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాలలో ఏర్పాటుకు నిర్ణయించారు. తాండూరులో జిల్లా ఆసుపత్రి, మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో, పరిగిలో పురపాలక కార్యాలయం ఆవరణలో, కొడంగల్‌లో బస్‌స్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేయనున్నారు. మహిళా సంఘాలకు అవసరమైన బ్యాంకు రుణాలను ఇప్పిస్తారు. వచ్చే నెలలో ప్రారంభించడానికి అధికారులు సిద్ధం అవుతున్నారు.

కుట్టులో శిక్షణ

జిల్లాలోని నాలుగు పురపాలిక సంఘాల్లో ఒక్కో కుట్టు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. వికారాబాద్, తాండూరులో ఇవి పనిచేయటం ప్రారంభించాయి. కొడంగల్‌లో కమ్యూనిటీ హాల్‌లో, పరిగిలో పాత రోడ్లు భవనాల శాఖ భవనంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాల్లో పాఠశాలలు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు అవసరమైన దుస్తులు కుడతారు. అంతేకాకుండా ఇక్కడ మహిళా సంఘాల సభ్యులకు కుట్టు పనుల్లో శిక్షణ ఇస్తారు.

జిల్లా స్థాయి ఎంటర్‌ప్రైజెస్‌లు..

జిల్లా స్థాయిలో 26 సంఘాల ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రైజెస్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు గాను రూ.5.25 కోట్లు రుణాలు ఇప్పిస్తారు. వికారాబాద్‌లో 9, తాండూరులో 11, కొడంగల్‌లో 2, పరిగిలో 4 ఏర్పాటు చేస్తారు. గ్రూపు సభ్యులకే కాకుండా వ్యక్తిగతంగా అభివృద్ధి చెందటానికి 149 యూనిట్లకు రూ.5.21 కోట్లు రుణం ఇప్పిస్తారు.

జిల్లాలో పట్టణ మహిళా సహాయ సంఘాలు: 2,488

సభ్యులు: 25 వేలు

లక్ష్యం: 548 సంఘాలకు రూ.35 కోట్లు

ఇప్పటి వరకు మంజూరు: 250 సంఘాలకు రూ.19 కోట్లు

ప్రాంతీయ మహిళా సంఘాలు: 106

నిరుపేద మహిళల కోసమే..

జిల్లాలో మెప్మా ఆధ్వర్యంలో నిరుపేద మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నాం. మహిళా రైతులు పండించిన కూరగాయలు చెడిపోకుండా వికారాబాద్‌లో శీతల గిడ్డంగి నిర్మిస్తాం. గృహ సేవకులను నియమించనున్నాం. కార్మిక అడ్డాలను ఏర్పాటు చేస్తాం.

రవికుమార్, మెప్మా జిల్లా అధికారి, వికారాబాద్.

# మట్టి రోడ్లకు మహర్దశ

కొడంగల్: పల్లెల్లో మట్టి రోడ్లకు మోక్షం లభించనుంది. బీటీగా మార్చడానికి యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో సీఆర్ఆర్ నిధులతో చేపట్టే కొన్ని రోడ్లకు టెండర్లు పూర్తయ్యాయి. కొన్నింటి పనులు సైతం ప్రారంభం అయ్యాయి. నియోజకవర్గంలోని కొడంగల్ మండలంలో 12.5 కిలోమీటర్ల రోడ్లకు సంబంధించి రూ.28 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నారు.

శాశ్వత పరిష్కారం దిశగా..

కొడంగల్ మండలంలోని సంగాయిపల్లి నుంచి లక్ష్మీపల్లి దూరం 1.5 కి.మీ. ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్డు లేక సంగాయిపల్లి నుంచి లక్ష్మీపల్లికి వెళ్లేందుకు ఆయా గ్రామాల వాసులు 6 కి.మీ. దూరం ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం రూ.4.40 కోట్ల నిధులు మంజూరై పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రెండు గ్రామాలకు మధ్య వాగు ఉండటంతో వంతెన పనులు ముందుగా చేపట్టారు.

చిట్లపల్లి నుంచి ఖాజాఅహ్మద్‌పల్లి మధ్య కొంత దూరం బీటీగా మారినామరో కిలోమీటర్ దూరం పనులు జరగాల్సి ఉంది. ఇందుకు రూ.1.30 కోట్ల నిధులు కేటాయించారు. టెండర్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

తగ్గనున్న 22 కిలోమీటర్లు

కొడంగల్ మండలంలోనే అతి పెద్ద పంచాయతీగా ఉన్న రుద్రారం నుంచి తాండూరు వెళ్లేందుకు దాదాపు 42 కి.మీ. దూరం ప్రయాణిస్తున్నారు. ఇక్కడ రోడ్డు వేయాలని 10 గ్రామాలకు చెందిన



ప్రజలు 40 ఏళ్లుగా కోరుతున్నారు. ప్రస్తుతం పాటీమీది పల్లి నుంచి గోటికే కలాన్ వరకు పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 10 కిలోమీటర్ల దూరానికి సంబంధించి రూ.22 కోట్ల నిధులు కేటాయించారు. టెండర్లు పూర్తి కావడంతో పాటు ఈ వారంలో పనులు చేపట్టనున్నారు. పాటీమీదిపల్లి మీదుగా రోడ్డు పూర్తయితే రుద్రారం నుంచి తాండూరుకు కేవలం 20 కి.మీ దూరం ఉంటుంది. 22 కి.మీ దూరం తగ్గ నుంది.

# డెంగీ కలవరం

మహేశ్వరం : డెంగీ జ్వరాలు రాజధానిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (బల్దియా) దోమల నివారణలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటంతో కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నాయి. నీలోఫర్‌లో పదిహేను మంది చిన్నారులు ప్రమాదకర పరిస్థితుల్లో చికిత్స పొందుతుండగా గాంధీ, ఉస్మానియాతో పాటు మిగిలిన ఆస్పత్రుల్లోనూ డెంగీ బాధితులు ఎక్కువే ఉన్నారు. ప్రమాదకర ఘంటికలు.. గ్రేటర్‌లో మొత్తం 4,646 కాలనీలు ఉండగా అందులోని వెయ్యి కాలనీల్లో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నా



యి. దోమల నివారణ చర్యల్లో జీహెచ్ఎంసీ వైఫల్యమే అందుకు కారణం. వైద్య ఆరోగ్యశాఖ, జీహెచ్ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 15 వరకు నగరంలోని 108 డివిజన్లలో 456 వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎక్కువ గా డెంగీ బాధితులున్న 404 కాలనీలను గుర్తించారు. వాటిలో ఒకరికి మలేరియా జ్వరం, 731 మందికి డెంగీ ఉన్నట్టు తేలింది.

జీహెచ్ఎంసీ భిన్న ప్రకటన.. ఈ నెలలో పది రోజులపాటు చేపట్టిన వైద్య శిబిరాల్లో 731 మందికి డెంగీ ఉన్నట్టు తేలగా, బల్దియా మాత్రం ఈ నెలలో 378 మందికి మాత్రమే ఉన్నట్టు లెక్కలు చూపుతోంది.

అమాత్యుడు చెప్పినా.. బాపూఘాట్ నుంచి అత్తాపూర్ వంతెన వరకు మూసీ నదిలో పెద్దఎత్తున గుర్రపు డెక్క పేరుకుపోయింది. మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ప్రాంతంలోనే ఉంటారు. చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నకు జూపల్లికి నెల రోజుల కిందట ఫోన్ చేసి తక్షణం మూసీలో గుర్రపు డెక్కను తొలగించమని ఆదేశించి ఇప్పటివరకు పూర్తి చేయలేదు. ఈ పనులను పర్యవేక్షించాల్సిన బల్దియా ఇంజనీర్ నరేందర్ గౌడ్ ఈ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ ఒక్క జోన్‌లోనే కాదు జోనల్, డిప్యూటీ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదు.

## మూడు గంటల్లోనే డెంగీ పరీక్ష

వికారాబాద్ : జిల్లాలో జ్వరాలు ముప్పెట దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా డెంగీ ఆందోళన కలిగిస్తోంది. మూడు నెలలుగా 4998 డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే 119 పాజిటివ్ అని తేలడంతో ఆ మేరకు వైద్యశాఖ అప్రమత్తంగా ఉంది. ఎప్పటికప్పుడు వేగంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. బయట ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకుంటే రూ.800 వరకు వసూలు చేస్తున్నారు. ఇక్కడే చేయించుకుంటే పేదలకు ఖర్చు కూడా తగ్గుతుంది. వికారాబాద్ జిల్లా కేంద్రంలో రూ.3.50 కోట్లతో రోగ నిర్ధారణ పరీక్షా కేంద్రం(టీహబ్) చేపట్టి మూడేళ్ల క్రితం ప్రారంభించారు. ఫలితాలు బాగా రావడంతో అనుబంధంగా రేడియాల జీ, పాథాలజీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో గతంలో కేవలం 57 రకాల పరీక్షలు మాత్రమే చేసేవారు. ప్రస్తుతం 87 రకాల పరీక్షలు చేస్తున్నారు. ముమ్మందు 154 పరీక్షలు జరపనున్నారు.



40 ఆసుపత్రుల నుంచి

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు అవసరమైన డెంగీ పరీక్షలు ఈ హబ్‌లో చేస్తున్నారు. నిర్ధారణ కోసం ప్రత్యేకంగా 'ఎలీసా' పరీక్షలు జరుపుతున్నారు. ఒకేసారి 100 నుంచి ఆపై నమూనాలను పరీక్షిస్తున్నారు. ఈ పరీక్ష పూర్తి కావడానికి సుమారు 3 గంటల సమయం పడుతుంది. మొత్తం 40 ఆసుపత్రుల నుంచి నమూనాలు పంపిస్తున్నారు. జిల్లాలోని 31 ఆసుపత్రులతో పాటు రంగారెడ్డి జిల్లాలోని 9 ఆసుపత్రుల నుంచి నమూనాలు వస్తున్నాయి. నమూనాల సేకరణకు 6 రూట్లకు గాను 6 వాహనాలున్నాయి.

## సర్కారు భూమిలో స్థిరాస్తి వ్యాపారం

మహేశ్వరం : అదో ప్రభుత్వ భూమి. రైతులు పంటలు పండించేందుకు, పండిన పంటను రవాణా చేసేందుకు బండి బాట ఉంది. సమీపంలో స్థిరాస్తి వ్యాపారి ఒకరు వెంచర్ నిర్మాణాన్ని చేపట్టారు. ప్రభుత్వ భూమి నుంచి తారు రోడ్డు నిర్మించి ప్లాట్లు విక్రయిస్తున్నారు. మరోవైపు 7.59 ఎకరాల తుమ్మలకుంట చెరువును స్థిరాస్తి వ్యాపారి మాయం చేశారు. వెంచర్‌లో కలిపిన ప్లాట్లుగా చేసి అమ్మేశారు.

తుక్కుగూడ పరిధిలో ఆక్రమణల తీరిది..మహేశ్వరం మండలం మంఖాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 131లో 60 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 15 ఎకరాలు రెండు పడక గదుల ఇళ్లు, విద్యుత్తు ఉప కేంద్రానికి కేటాయించగా మిగిలిన భూమిలో దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్నారు. పక్కనే ఓ స్థిరాస్తి వ్యాపారి 30 ఎకరాల్లో భారీ వెంచర్ వేశారు. ఇందులోకి దారి లేక అతని కన్ను ప్రభుత్వ భూమిపై పడింది. బండిబాటను తారు రోడ్డుగా మార్చేశారు. స్థానిక నేతల అండతో రూ.5 కోట్ల విలువైన ఎకరా భూమిలో 40 అడుగుల రోడ్డు నిర్మించారు. వాస్తవానికి వెంచర్ వేసిన భూముల్లో గతంలో తుమ్మలకుంట చెరువు ఉండేది. నీటిపారుదల శాఖ లెక్కల ప్రకారం చెరువు 7.59 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని కింద 18 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు రికార్డులో నమోదైంది. పట్టా భూముల్లో చెరువు ఉందన్న కారణంతో దాన్ని నామ రూపాలు లేకుండా చేసి ప్లాట్లు చేశారు. వాల్టా చట్టం ప్రకారం ఏదైనా నీటివనరు పట్టా భూముల్లో ఉంటే దాని స్వరూపాన్ని మార్చకూడదు. కేవలం నీరు లేనప్పుడు వ్యవసాయ అవసరాలకు మాత్రమే వినియోగించాలి. దీన్ని పట్టించుకోకుండా చెరువును పూర్తిగా పూడ్చివేశారు.




ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది.. తొలిరోజు బిజీబిజీగా గడిపిన ఆయన.. ఈ రోజు కూడా వరుసగా కేంద్ర మంత్రులను కలవనున్నారు.. ఇవాళ మొదటగా కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయ్యారు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు.. ఈ భేటీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.. రాజధాని అమరావతికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కనెక్టివిటీ, అమరావతి – హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, అమరావతి – రాయలసీమ జిల్లాల కనెక్టివిటీ సహా రాష్ట్రంలోని పలు ఇతర జాతీయ రహదారుల గురించి చర్చించారు.. ఇక, తొలిరోజు ఢిల్లీ పర్యటనలో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు సీఎం చంద్రబాబు నాయుడు.. ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోడీతో ప్రత్యేకంగా సమావేశమైన విషయం విదితమే.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ఫలప్రదమైన సమావేశం జరిగింది అంటూ ట్విట్టర్‌లో పంచుకున్నారు చంద్రబాబు.. పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు క్యాబినెట్ ఆమోదం తెలపడంపై కృతజ్ఞతలు తెలిపాను.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వివరించాను .. ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి అందిస్తున్న చేయూతకు ధన్యవాదాలు తెలిపాను.. అమరావతి రాజధాని నిర్మాణానికి మద్దతు అందిస్తున్నారు అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.. మరోవైపు.. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవతో సమావేశంపై కూడా ఎక్స్ లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మరో పోస్టు పెట్టారు.. డిసెంబర్‌లో వైజాగ్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేస్తామని.. ఏపీలో రైల్వే శాఖ 73,743 కోట్ల రూపాయల పెట్టుబడులు పెడుతోంది.. హౌరా– చెన్నై నాలుగు లైన్ల ప్రాజెక్టులో ఇది భాగం.. 73 రైల్వేస్టేషన్లో ఆధునికరిస్తారు.. మరిన్ని స్థానిక రైళ్లను నడుపుతారు.. రైల్వే శాఖ భాగస్వామ్యంతో ఏపీ ప్రభుత్వం పని చేయడానికి సిద్ధంగా ఉంది అంటూ ట్వీట్ చేసిన విషయం విదితమే..




## హరియాణాలో కమలం హ్యాట్రిక్.. ఎగ్జిట్ పోల్స్‌ను తలకిందులు చేస్తూ పుంజుకొంది ఇలా..!

పార్లమెంట్ ఎన్నికల్లో హరియాణాలో సీట్లు తగ్గడంతో భాజపా అప్రమత్తమైంది. దీనిని ఉపేక్షిస్తే.. రాష్ట్రం చేజారే ప్రమాదం ఉందని భావించింది. అభ్యర్థుల ఎంపిక నుంచి కుల సమీకరణల వరకు కసరత్తు చేసింది. ముఖ్యంగా జాతీయ స్థాయి నేతలతోకాకుండా.. రాష్ట్ర స్థాయిలోనే భాజపా ఈ పోరాటం చేయడం విశేషం. ప్రీపోల్స్, పోస్ట్ పోల్ సర్వేలు ప్రభుత్వ వ్యతిరేకత బలంగా ఉందని కోడై కూసినా.. ప్రజలు మాత్రం కమలదళానికే పట్టం కట్టారు.

**భాజపా బలమైన సోషల్ ఇంజినీరింగ్ :** భాజపా సోషల్ ఇంజినీరింగ్ కూడా బలంగానే పనిచేసిందనే ప్రచారం జరిగింది.

రాష్ట్రంలో జాట్ వర్గం కాంగ్రెస్ ఛత్రం కింద ఏకమవుతోందని భాజపా గ్రహించింది. దీనికి రెజ్లర్ల ఆందోళన కూడా తోడవడంతో బలమైన ఓబీసీ వర్గాన్ని తమ వైపునకు తిప్పుకొనేందుకు నాయబ్‌సింగ్ సైనీకి అధికార పగ్గాలు అందించింది. దీంతో ఆ రాష్ట్రంలో జాట్ వర్సెస్ ఇతరులు అన్న పోరాటంలో పైచేయి సాధించింది. దీనికి తోడు దళితుల్లో బలమైన జాటవ్‌లు కాంగ్రెస్ పక్షం వహించగా.. వారిలో మిగిలిన కులాలు భాజపా వైపు మళ్లాయి. అగ్రకులాలు, పంజాబీలపై భాజపా ఎక్కువగా ఆధారపడింది. ఈక్రమంలో లోక్‌సభ ఎన్నికల్లో నష్టంతో వెంటనే తేరుకొని.. పార్టీ రాష్ట్ర పగ్గాలను బ్రాహ్మణవర్గానికి చెందిన మోహన్‌లాల్ బదోలికి అప్పగించింది. రాష్ట్రంలో ఈ వర్గం ఓట్లు 7.5శాతం ఉంటాయి. 11 సీట్లను ఈ వర్గానికి కేటాయించింది. సాధారణంగా రాష్ట్రంలోని అగ్రకులాలు, పంజాబీల్లో ఎక్కువ కుటుంబాలు దేశ విభజన తర్వాత వలసవచ్చి స్థిరపడ్డవే. వీరు గ్రాండ్ ట్రంక్‌రోడ్ మార్గంలోని అర్బన్ నియోజకవర్గాల్లో అధికంగా ఉంటారు. 2014, 2019 ఎన్నికల్లో వీరే భాజపాకు మద్దతుగా నిలిచారు.

మరోవైపు కాంగ్రెస్ జాట్–దళిత్ కూటమి ఏర్పాటుచేసింది. భాజపా యాంటీ జాట్ కూటమితో హస్తం పార్టీ దూకుడు తగ్గించాల్సి వచ్చింది. ముఖ్యంగా జాట్ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే.. అర్బన్ ఓట్లను కోల్పోవచ్చనే ఆందోళన చెందింది. దీంతో సీఎం అభ్యర్థి పేరు ప్రకటనను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

## పల్లె పండుగకు సిద్ధం కండి - పవన్ కల్యాణ్



అమరావతి – ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు సత్వరమే మొదలుపెట్టాలని, కూటమి పాలన మొదలుపెట్టాక పంచాయతీలకు నిధుల సమస్య లేకుండా చేశామని ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. .. పాలన మొదలైన తొలి వంద రోజుల్లోనే 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.1987 కోట్లు, ఎన్ఆర్ఈజీఎస్. ద్వారా రూ.4500 కోట్లు నిధులు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించినందున నిధుల సమస్య ఉత్పన్నం కాదన్నారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.. రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా.. వివిధ జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడుతూ, ఈ నెల 14వ తేదీ నుంచి రాష్ట్రంలోని పంచాయతీల్లో నిర్వహించే 'పల్లె పండుగ' కార్యక్రమంపై కీలక సూచనలు చేశారు.. అక్టోబర్ 14వ తేదీ నుంచి ప్రతి పంచాయతీలో అభివృద్ధి పనులను మొదలుపెట్టాలని అధికారులను గతంలోనే ఆదేశించారు.. గ్రామ సభలలో ఆమోదించిన పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనుల ప్రారంభం గురించి ఈ సమావేశంలో చర్చించారు. 13,326 పంచాయతీల్లోనూ ఉపాధి హామీ పనులకు తీర్మానాలు చేశారని, ఆ మేరకు చేపట్టే పనులు, పని దినాల వివరాలను అధికారులు తెలిపారు. ఇక, ఈ నెల 14వ తేదీ నుంచి వారం రోజులపాటు పనుల ప్రారంభాన్ని ఒక పండగలా చేయాలని ఉప ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. 20వ తేదీ వరకూ పంచాయతీల్లో పనుల ప్రారంభానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.




జమ్మూకశ్మీర్‌లో అధికార పీఠం నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్ కూటమికి సొంతమైంది. తాజాగా వెలువడిన ఫలితాల్లో ఎన్‌సీ కూటమి మ్యాజిక్ ఫిగర్ దాటేసింది. మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ఆ పార్టీ ప్రస్తుతం 41 స్థానాల్లో విజయం సాధించగా.. మరోచోట ఆధిక్యంలో ఉంది. అలాగే కాంగ్రెస్ ఆరు సీట్లు దక్కించుకుంది. ఆ కూటమి భాగస్వామి పార్టీ సీపీఎం ఒక స్థానాన్ని సొంతం చేసుకుంది.

దాంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 48 సీట్లు ఆ కూటమికి దక్కినట్లయింది. ఇక భాజపా 27 స్థానాల్లో గెలుపొందగా.. రెండు స్థానాల్లో ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది. అసెంబ్లీలో మొత్తం 90 స్థానాలున్నాయి. 2014లో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో 87 సీట్లలో భాజపా 25 స్థానాలు సాధించింది. పీడీపీతో పొత్తు పెట్టుకొని ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. నియోజకవర్గాల పునర్విభజనతో ఇప్పుడు జమ్మూకశ్మీర్‌లో సీట్లు 90కి పెరిగాయి. అయితే గవర్నర్ కోటాలో ఐదు నామినేటడ్ సీట్లు ఉన్నాయి. దీంతో మ్యాజిక్ ఫిగర్ 48గా ఉంది. 2019లో ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలు(జమ్మూకశ్మీర్, లద్దాఖ్)గా కేంద్రం విభజించింది. ఈ నేపథ్యంలో జరిగిన తొలి ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ రాణించింది. అక్కడి మరో ప్రాంతీయ పార్టీ పీడీపీ మూడు స్థానాలు దక్కించుకుంది. ఇండియా కూటమిలో భాగమైన ఆప్.. ఇక్కడ తొలిసారి పోటీ పడి, ఖాతా తెరిచింది. స్వతంత్రులు ఏడు స్థానాలు దక్కించుకున్నారు. ఈ విజయంతో సంతోషంలో ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనేత ఫరూక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడు ఒమర్ అబ్దుల్లానే ముఖ్యమంత్రి బాధ్యతలు చేపడుతారని తెలిపారు. 'పదేళ్ల తర్వాత ప్రజలు తమ తీర్పును తెలియజేశారు. ఆగస్టు 5 నాటి నిర్ణయాన్ని (2019లో ఆర్టికల్ 370 రద్దు చేయడాన్ని ప్రస్తావిస్తూ) తాము అంగీకరించడం లేదని స్పష్టంగా చెప్పారు. ఒమర్ అబ్దుల్లానే తదుపరి ముఖ్యమంత్రిగా ఉంటారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు మా కూటమి నిరంతరం పోరాడుతుంది" అని ఫరూక్ అబ్దుల్లా వెల్లడించారు.



## కేంద్రమంత్రి కుమరస్వామితో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ

రెండు రోజుల పర్యటన నిమిత్తం నిన్న ఢిల్లీ వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పలువురు కేంద్రమంత్రులతో సమావేశం అవుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామితో భేటీ అయ్యారు. ముందుగా కుమారస్వామి నివాసానికి వెళ్ళిన బాబును.. ఆయన సాదరంగా ఆహ్వానించారు. అనంతరం విశాఖ స్టీల్ ప్లాంట్ ను సెయిల్ లో విలీనం చేయడంపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలుస్తోంది.

కాగా ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిన విశాఖ ఉక్కు పరిశ్రమను గట్టెక్కించడానికి సీఎం ప్రధానితో పాటు పలువురు కేంద్రమంత్రులతో మంతనాలు జరుపుతున్నారు




## వరించిన అదృష్టం.. మల్లయోధురాలు ఘన విజయం..

హర్యానాలో కాంగ్రెస్ గెలుపు ఆశలు సఫలం కాకపోయినా.. అందరి దృష్టిని ఆకర్షించిన జులానా సీటులో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి, ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫోగట్ ఘన విజయం సాధించారు. మొత్తం 15 రౌండ్లలో వినేశ్ ఫోగట్ 4వేలకు పైగా ఓట్ల ఆధిక్యంలో గెలుపొందారు. ఈ విజయంతో మల్లయోధురాలు వినేశ్ ఫోగట్ ఎమ్మెల్యే అయ్యారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఆధిక్యం కనబర్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఫోగట్.. ఈవీఎం ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్‌లో ముందంజలో దూసుకుపోయారు. ఆ తరువాత రౌండ్లలో స్వల్పంగా వెనకపడ్డారు. మొదటి ఏడు రౌండ్లు పూర్తయ్యేసరికి కొంచెం వెనుకపడిన ఫోగట్.. 8వ రౌండ్ నుంచి ఆధిక్యాన్ని కనబర్చారు. 8,9,10, 11, 12 రౌండ్లలో ఆధిక్యం రావడంతో 12 రౌండ్లు ముగిసే సమయానికి 4వేలకు పైగా ఓట్ల ఆధిక్యాన్ని ఫోగట్ సాధించారు.

## ప్రభుత్వంపై బురదచల్లేందుకే వైకాపా తప్పుడు ప్రచారం: తెదేపా ఎమ్మెల్యేలు



విజయవాడ: వరద నష్ట పరిహారం పంపిణీపై వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని ఉమ్మడి కృష్ణా జిల్లా తెదేపా ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై బురదచల్లేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్ పాల్గొన్నారు. వరదలు వచ్చిన 15–20 రోజుల్లోనే బాధితులకు ప్రభుత్వం పరిహారం పంపిణీ చేసిందని గద్దె రామ్మోహన్ అన్నారు. 98 శాతం మందికి సాయం అందిందని.. సాంకేతిక కారణాలతో 2 శాతం మందికి అందలేదని చెప్పారు. త్వరలోనే వారికీ పరిహారం అందజేస్తామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం అందాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. పరిహారం అందలేదనే ఫిర్యాదులు బాధితుల నుంచి రాకూడదని అధికారులకు ఆయన స్పష్టం చేశారని చెప్పారు.

వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని.. ప్రజలకు వాస్తవాలు తెలియాలని వసంత కృష్ణప్రసాద్ అన్నారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో రైతులకు హెక్టారుకు రూ.25వేలు చొప్పున సీఎం చంద్రబాబు పరిహారం అందజేశారని చెప్పారు. ముంపునకు గురైన ఇళ్లలో గ్రౌండ్ ఫ్లోర్‌కి రూ.25వేలు, ఫస్ట్ ఫ్లోర్‌కి రూ.10వేల సాయం ఇచ్చారని తెలిపారు. సీఎం 11 రోజుల పాటు బస్సులోనే ఉంటూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ప్రజలను ఆదుకున్నారన్నారు.



## రూ.2.30 కోట్ల కరెన్సీతో గంగానమ్మకు అలంకారం

జంగారెడ్డిగూడెం: తెలుగు రాష్ట్రాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో గ్రామదేవత గంగానమ్మను రూ.2.30 కోట్ల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో గంగానమ్మ విగ్రహం చుట్టూ భారీగా నోట్ల కట్టలు, కాయిన్స్ ఉంచారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు.

## టీటీడీ కళ్యాణ మండపాలపై చంద్రబాబుకు ఎంపీ కలిశెట్టి వినతులు



న్యూఢిల్లీ, అక్టోబర్ 8: "టీటీడీ కళ్యాణ మండపాలను ధార్మిక కేంద్రాలుగా మార్చండి. దేశవ్యాప్తంగా టీటీడీ ఆధ్వర్యంలో ఉన్న దేవాలయాలకు పాలకమండళ్ళు ఏర్పాటు చేయండి. అమరావతి రాజధానిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటుగా ఎంపీలకు కూడా వసతి సౌకర్యాలు కల్పించండి. జర్నలిస్టులకు రైల్వే పాసులను పునరుద్ధరించి టోల్ గేట్ ల వద్ద ఫ్రీ పాస్ లను అందించండి" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వినతి చేశారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన ఎంపీ ఈ మేరకు వినతి పత్రాలను సమర్పించారు. ఇతరుల చేతుల్లో ఉన్న కళ్యాణ మండపాలను వెంటనే టీటీడీ స్వాధీనం చేసుకుని వాటిలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఢిల్లీ , చెన్నై, హైదారాబాద్, బెంగళూరు, విశాఖపట్నం లాంటి నగరాలలో, దేశవ్యాప్తంగా టీటీడీ ఆధీనంలో వున్న దేవాలయాలకు పాలకమండళ్ళు ఏర్పాటు చేయాలని వినతి చేశారు. భవిష్యత్తులో అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటు ఎంపీలకు కూడా వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు రైల్వే పాసుల పునరుద్ధరణ, టోల్ గేట్‌ల వద్ద జర్నలిస్టులకు ఫ్రీపాస్ కల్పించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు.

## ఆర్జీవీ.. జగన్‌పై అలా సినిమా తీస్తే బాగుంటుందేమో..

నెల్లూరు, అక్టోబర్ 8: దేశంలో బీజేపీ అనుకూల పవనాలు వీస్తున్నాయని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్ అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. హర్యానా, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి అనుకూల పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ ఓడిపోయిన తరువాత మతిస్థిమితం కోల్పోయినట్టు ఉన్నారని వ్యాఖ్యలు చేశారు. కూటమి పాలనలో వికసిత ఆంధ్రప్రదేశ్ కనిపిస్తోందన్నారు. ఐదేళ్ల పాలనలో జగన్ స్టిక్కర్ సీఎంగా మిగిలిపోయారంటూ ఎద్దేవా చేశారు. ఏపీ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా, మంచి సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. హామీలు నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వంపై, జగన్ అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు గాల్లో తిరిగే ముఖ్యమంత్రి కాదని స్పష్టం చేశారు. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తిరుమలకు చెందిన కొన్ని రిజర్వేషన్లలో మార్పులు తీసుకొచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఏపీ ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోడంతో జగన్ కోర్టులని ఆశ్రయించారన్నారు. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి టీటీడీకి రాదని.. టీటీడీ నుంచే ప్రభుత్వానికి నిధులు వస్తున్నాయన్నారు. అవినీతి డబ్బు ఎలా సంపాదించాలని... అక్రమాలు ఎలా చేయాలో జగన్ దేశానికే ఒక మోడల్‌గా నిలుస్తారంటూ వ్యాఖ్యలు చేశారు. రాంగోపాల్ వర్మ... జగన్ రాష్ట్రాన్ని నాశనం చేసిన తీరుపై సినిమా తీయాలన్నారు. టెక్కలి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, మాధురిలు తిరుమల ధార్మిక క్షేత్రానికి వచ్చి ఫోటో షూట్ చేశారని.. నిన్న తిరుమలలో జరిగిన దువ్వాడ జంట ఫోటో షూట్ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోసారి తిరుమల ప్రతిష్టకి భంగం కలిగించే ఘటనలు చేస్తే అలిపిరి దాటనివ్వమని హెచ్చరించారు.

# నిధి అగర్వాల్.. పట్టుచీరలో చందమామలా..

నిధి అగర్వాల్ ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫోటోషూట్లతో అభిమానులను కట్టిపడేస్తోంది. ఇటీవల షేర్ చేసిన ఫొటోలలో ఆమె సంప్రదాయ చీరలో పట్టు చీర కట్టుకుని, అందమైన ఆభరణాలు ధరించి కనిపిస్తోంది. ఆమె పసుపు రంగు చీరలో, విభిన్నమైన ఆభరణాలతో తన అందాన్ని మరింత హైలైట్ చేయడం జరిగింది. నిధి సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్‌తో తన అభిమానులను మరోసారి అలరించింది. ఈ ఫోటోల్లో నిధి అగర్వాల్ సంప్రదాయ లుక్‌కి తోడు, ఆమె పెట్టుకున్న గజరాలు, అందమైన నగలు ఆమెను మరింత రాచరికమైన లుక్‌కి చేరువ చేశాయి. సోషల్ మీడియాలో ఆమె అభిమానులు ఈ లుక్‌కి ఫిదా అయ్యారు. 'Yes, I am their Bangaram' అనే క్యాప్షన్‌తో ఈ ఫోటోను షేర్ చేసిన నిధి తన గ్లామర్‌కి ఎలాంటి సరిహద్దు ఉండదని మరోసారి నిరూపించింది.



ప్రస్తుతం 'హరిహర వీరమల్లు' సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన నటిస్తూ ఉన్న నిధి అగర్వాల్, తన కెరీర్‌లో దూసుకుపోతుంది. ప్రస్తుత తెలుగు సినిమాల్లో మంచి స్థానం సంపాదించుకున్న నిధి, వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఈ చీరలో కనిపించిన ఆమె లుక్‌కి సంబంధించిన ఫోటోలు అభిమానుల నుంచి విపరీతమైన రెస్పాన్స్ అందుకుంటున్నాయి. నిధి అగర్వాల్ నటనతో పాటు తన ఫ్యాషన్ ఎంపికలతో కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. టాలెంట్‌తో పాటు గ్లామర్‌కి కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఆమెకు ఇంతటి ఫాలోయింగ్ ఉందని చెప్పవచ్చు. ఇక అమ్మడికి అర్జెంటుగా ఒక మంచి సక్సెస్ రావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం చేస్తున్న సినిమాలలో బిగ్ మూవీగా హరహర వీరమల్లు తెరకెక్కుతోంది. మరి నిధికి ఆ సినిమా ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.

# 'మిరపకాయ్' బ్యూటీ ఎలా మారిందో చూడండి

టాలీవుడ్ లో హీరోయిన్ గా రానాతో కలిసి లీడర్ సినిమాతో 2010లో పరిచయం అయిన ముద్దుగుమ్మ రిచా గంగోపాధ్యాయ. ఈ అమ్మడు కెరీర్ ఆరంభంలోనే వరుసగా సినిమా ఆఫర్లు సొంతం చేసుకుంది. రవితేజ తో ఈమె కలిసి నటించిన మిరపకాయ్ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం ద్వారా వరుసగా ఆఫర్లు వచ్చాయి. అయితే ఈమె మాత్రం చాలా అరుదుగా సినిమాలు చేస్తూ వచ్చింది. ప్రభాస్ తో ఈమె కలిసి నటించిన మిర్చి సినిమా సైతం భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే రిచా గంగోపాధ్యాయ వరుసగా ఆఫర్లు వస్తున్న సమయంలోనే చదువు కోసం విదేశాలకు వెళ్తున్నట్లుగా ప్రకటించింది. విదేశాల్లో ఉన్నత చదువులు చదివిన తర్వాత తిరిగి ఇండియాకు వచ్చి సినిమాల్లో నటిస్తుందని అంతా భావించారు. కానీ రిచా గంగోపాధ్యాయ తిరిగి రాలేదు. అక్కడే పెళ్లి చేసుకుని గృహిణిగా స్థిరపడింది. అక్కడే ప్రస్తుతం ఫ్యామిలీతో జీవితాన్ని చాలా సంతోషంగా గడుపుతున్నట్లుగా ఆమె సోషల్ మీడియా ద్వారా షేర్ చేసిన ఫోటోలను, వీడియోలను చూస్తే అర్థం అవుతుంది. సినిమాల్లో నటించే సమయంలో చాలా సన్నగా నాజూకుగా కనిపించిన రిచా గంగోపాధ్యాయ ఇప్పుడు మాత్రం చాలా లావు గా కనిపిస్తోంది. పెళ్లి పిల్లల కారణంగా ఆమె లుక్ పూర్తిగా మారిందని అభిమానులు సోషల్ మీడియాలో మాట్లాడుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్ లో దాదాపు 80 వేల



మంది ఫాలోవర్స్ ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్ గా తన ఫ్యామిలీ ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. తాజాగా మరోసారి తన అందమైన ఫ్యామిలీ ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. అంతే కాకుండా రిచా లుక్ గురించి సైతం చర్చ మొదలు అయింది. ఇంత బరువు పెరిగారు ఏంటి అంటూ కొందరు కామెంట్స్ చేస్తే, మీరు బరువు పెరిగినా అందంగా ఉన్నారని కామెంట్స్ చేస్తున్నారు. మీ క్యూట్ ఫోటోలను చూస్తూ ఉంటే మళ్లీ మీరు ఎప్పుడు సినిమాల్లో నటిస్తారా అంటూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం రిచా గంగోపాధ్యాయ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ముందు ముందు సెకండ్ ఇన్నింగ్స్ కి ఈమె ప్లాన్ చేస్తున్నట్లుగా ఆ మధ్య వార్తలు వచ్చాయి. కానీ తాజా సమాచారం ప్రకారం, ఆమె లుక్ ను చూస్తూ ఉంటే మాత్రం కచ్చితంగా రిచా గంగోపాధ్యాయ రీ ఎంట్రీ ఇచ్చేందుకు ఆసక్తిగా లేదేమో అనిపిస్తుంది. ఒక వేళ ఆమె రీ ఎంట్రీ ఇస్తే మాత్రం అద్భుతం అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. సోషల్ మీడియాలో ఆమెకు సంబంధించిన పాత వీడియోలు, ఫోటోలు షేర్ చేస్తూ తిరిగి ఇలాంటి రిచా మాకు కావాలి అంటున్నారు. రిచా తో పాటు ఎంట్రీ ఇచ్చిన చాలా మంది హీరోయిన్స్ ఇంకా సినిమాలు చేస్తున్నారు. కనుక ఈమె చేస్తే బాగుండు అనేది కొందరు ఫ్యాన్స్ అభిప్రాయం.




# పర్ఫెక్ట్ ప్లాన్ తో పొట్టేల్.. రిలీజ్ ఎప్పుడంటే..




గ్రామీణ నేపథ్యంతో రూపొందిన యాక్షన్ డ్రామా 'పొట్టేల్' అక్టోబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. యువ నటుడు యువ చంద్ర కృష్ణ, టాలెంటెడ్ నటి అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, డైరెక్టర్ సాహిత్ మోత్కూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్, టీజర్ ఈ సినిమాపై మంచి అంచనాలు పెంచుతున్నాయి. ఈ సినిమాను నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణ సంస్థకు చెందిన నిషాంక్ రెడ్డి కుడితి, ప్రగ్యా సన్నిధి క్రియేషన్స్ నుంచి సురేష్ కుమార్ సాదిగే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సినిమాలో సీనియర్ నటుడు అజయ్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇటీవలే విడుదలైన అజయ్ ఫస్ట్ లుక్ ఆడియన్స్ ను ఆకట్టుకుంది. ఇదే క్రమంలో యాక్షన్‌తో కూడిన గడ్డా కథ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన అప్డేట్స్ కూడా ఆడియన్స్ లో హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ సినిమా విడుదల తేదీ పోస్టర్ చూస్తే ఒక సీరియస్ ఏమోషన్ కనిపిస్తోంది, ప్రధాన పాత్రలైన యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల దంపతులు, వారి కూతురు, గ్రామస్థులు వివాదంలో ఉన్నట్లు అర్థమవుతుంది.

ఇక ఈ సినిమా అక్టోబర్ 25న విడుదల అవుతుండదం విశేషం. దీపావళి సెలవు దినం (అక్టోబర్ 29) సమయానికి సినిమా కలెక్షన్లకు పెద్ద లాభాన్ని తీసుకురావొచ్చని చిత్ర యూనిట్ భావిస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన సౌండ్‌ట్రాక్ ఇప్పటికే సూపర్ హిట్ అవ్వగా, విడుదలైన అన్ని పాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రత్యేకంగా పాటలు ఒక్కోటి ప్రత్యేకతను సొంతం చేసుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. టీజర్ కూడా మంచి స్పందనను సొంతం చేసుకుంది. సినిమాటోగ్రఫీ బాధ్యతలు మోనిష్ భూపతి రాజు నిర్వహించగా, ఎడిటర్‌గా కార్తీక శ్రీనివాస్, ఆర్ట్ డైరెక్టర్‌గా నార్ని శ్రీనివాస్ వ్యవహరించారు. సినిమా గ్రామీణ నేపథ్యంతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చేలా దర్శకుడు సాహిత్ మోత్కూరి కథను అల్లారు. ముఖ్యంగా గ్రామాల్లోని సామాజిక అంశాలు, కుటుంబ బంధాలు, ప్రతీకార భావనలకు పెద్దపీట వేశాడు. 'పొట్టేల్' కథలో యాక్షన్ అంశాలు ప్రధానంగా ఉంటాయి. గ్రామ స్థాయి కథతో తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను హత్తుకోవడానికి అన్ని అంశాలను కలిగి ఉందట. ప్రధానంగా ఈ కథలోని ఎమోషనల్ డీప్ నెస్ ఆడియన్స్ కి కనెక్ట్ అయ్యేలా ఉండబోతుంది. గ్రామీణ కథ, ఇంటెన్స్ యాక్షన్, బలమైన ఎమోషన్స్ ఈ సినిమాను ప్రేక్షకులకు మరింత దగ్గర చేస్తాయనే నమ్మకంతో దర్శకుడు చిత్రాన్ని తెరకెక్కించారు. మరి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

# 'కంగువా' టైమ్ ట్రావెల్... నిజమేనా?



తమిళ్ స్టార్ హీరో సూర్య, శివ కాంబోలో రూపొందిన కంగువా సినిమా మొదట అనుకున్న ప్రకారం దసరా కానుకగా అక్టోబర్ 10న విడుదల అవ్వాల్సి ఉంది. కానీ కొన్ని కారణాల వల్ల కంగువా సినిమాను నవంబర్ 14కు వాయిదా వేయడం జరిగింది. సినిమా షూటింగ్ ప్రారంభించింది మొదలుకుని అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. దాదాపు నాలుగు అయిదు సంవత్సరాలుగా సినిమా వార్తల్లో నానుతూ వస్తుంది. కరోనా వల్ల ఆలస్యం అయిన సినిమా మేకింగ్ సైతం చాలా స్లోగా సాగడం వల్ల విడుదల చాలా చాలా ఆలస్యం అయింది. ఏడాది కాలంగా రిలీజ్ కోసం ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. ఫైనల్ గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న కంగువా సినిమా గురించి మీడియాలో రకరకాలుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ముఖ్యంగా కథ గురించి ఎవరికి ఇష్టం వచ్చినట్లుగా వారు కథనాలు అల్లేస్తున్నారు. ముఖ్యంగా ఈ సినిమా కథ ఒక టైమ్ ట్రావెల్ కథ అంటున్నారు, రెండు టైమ్ జోన్ ల మధ్య సాగే ఈ కథ లో సూర్య రెండు విభిన్నమైన పాత్రల్లో కనిపించబోతున్నాడు. వంద సంవత్సరాల క్రితం కథ ను 2024 కాలానికి లింక్ చేస్తూ సాగే కథ తో కంగువా రూపొందినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుత టెక్నాలజీని 100 సంవత్సరాల క్రితం వినియోగిస్తే ఎలా ఉంటుంది అనేది సినిమా కథ అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విభిన్న, యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలను ఇప్పటి వరకు ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చి మెప్పించిన దర్శకుడు శివ ఈ సినిమాను అంతకు మించి అన్నట్లుగా రూపొందించాడు. తమిళ్ లో రూపొందిన ఈ సినిమా తెలుగు తో పాటు మొత్తం 34 భాషల్లో విడుదల చేయనున్నారనే వార్తలు వస్తున్నాయి. ఒక ఇండియన్ సినిమా ఇన్ని భాషల్లో విడుదల అవ్వడం చాలా రేర్ గా జరుగుతూ ఉంటుంది. పాతిక దేశాలకు పైగా ఈ సినిమా విడుదల కాబోతున్న నేపథ్యంలో కంగువా వసూళ్లు ఎలా ఉంటాయా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తమిళ్ మూవీ ఇప్పటి వరకు వెయ్యి కోట్ల మార్క్ ను టచ్ చేయలేదు. ఆ లోటును కంగువా భర్తీ చేస్తుందనే నమ్మకంను ప్రతి ఒక్కరు వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగానే కంగువా ను చాలా మంది బాహుబలి మూవీ స్థాయి మూవీ అని, తమిళ్ బాహుబలి అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయిలో కంగువా వసూళ్లు సాధించనుంది అనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ఫ్యాన్స్ తో పాటు ప్రతి ఒక్కరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సూర్య కు ఇది బెంచ్ మార్క్ మూవీగా నిలిచే అవకాశాలు ఉన్నాయి. భారీ ఎత్తున సినిమా విడుదల కార్యక్రమాలు జరుగుతున్నాయి. యూవీ క్రియేషన్స్, స్టూడియో గ్రీన్ సంస్థలు ఈ సినిమాను నిర్మించారు. దిశా పటానీ ఈ సినిమాలో హీరోయిన్ గా నటించింది. సూర్య చాలా స్పెషల్ పాత్రలో కనిపించబోతున్నారని మేకర్స్ చెబుతున్నారు.

# వైట్ సారీలో బుట్టబొమ్మ గుబులు పుట్టించేలా!

ఫ్యాషన్ వరల్డ్ లో ముంబై బ్యూటీ పూజాహెగ్డే ఓ స్పెషలిస్ట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అమ్మడి ఎంపికలు అమెలో బ్యూటీని అంతకంతకు హైలైట్ చేస్తుంటాయి. కటౌట్ కి తగ్గట్టు కంటెంట్ ఉంటుంది. సొగసరి ఎంపిక చేసుకునే దుస్తులే అందాన్ని రెట్టింపు చేస్తుంటాయి. హైట్..వెయిట్ కి తగ్గట్టు అలంకరణ విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. డిజైనర్ దుస్తులైనా...సంప్రదాయ వస్త్రాలైనా బుట్ట బొమ్మ ధరించిందంటే ఆ దుస్తులకే వన్నె వచ్చేస్తుంది. తాజాగా సొగసరి చీరందంలో తళుకులీనింది. ఇదిగో ఇక్కడిలో తెలుపు చీర..రవికలో అగ్గిరాజేస్తుంది. పూజ స్కిన్ టోన్ ని తెలుపు అందం పర్ఫెక్ట్ గా మ్యాచ్ చేసింది.



సాధారణ తెలుపు వర్ణం పలుచని చీరపై పొడి డిజైన్ తో కూడిన బ్లౌజు ఎంపిక చేసుకుంది. సారీ కంటే అమ్మడి స్కిన్ టోన్ సారీని డామినేట్ చేస్తుంది. ఇక అమ్మడు ఎంపిక చేసుకున్నయాక్సరసీస్ మరింత అందంగా తీర్చిదిద్దాయి. చెవులకు ఎంపిక చేసుకున్న దిద్దులు మరింత పెద్దవిగా ఫేస్ ని మ్యాచ్ చేస్తున్నాయి. నుదిటిన తెలుపు రంగు స్టికర్ పెట్టుకుంది. మ్యాకప్ సైతం లైట్ గా వేసుకుంది. పెదాలకు పూసిన లిప్ స్టిక్ ప్రతీది చీరని మ్యాచ్ చేస్తూ అలంకరించుకున్నవే. చీరందంలో అమ్మడు వివిధ భంగిమల్లో కెమెరాకి ఫోజులిచ్చింది. ఒక్కో పిక్ లో ఒక్కో ప్రత్యేకతను హైలైట్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇక పూజా కెరీర సంగతి చూస్తే..టాలీవుడ్ నుంచి ఎంత సాలిడ్ గా వెళ్లిందో? అంతే సాలిడ్ గా అమ్మడు సౌత్ లో కంబ్యాక్ అవుతోన్న విషయం తెలిసిందే. యువ సామ్రాట్ నాగచైతన్య సరసన ఓ కొత్త సినిమాకి ఇటీవలే సంతకం చేసింది. అతి త్వరలోనే ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది. అలాగే కోలీవుడ్ లో సూర్య 44వ చిత్రంలోనూ పూజ అవకాశం అందుకుంది.

# 1000 కోట్ల హీరోయిన్.. అస్సలు తగ్గట్లే..

బాలీవుడ్ నెంబర్ వన్ హీరోయిన్ దీపికా పదుకునే రీసెంట్ గా పండంటి ఆడపిల్లకి జన్మనిచ్చింది. ప్రస్తుతం ఆమె కూతురు ఆలనా పాలనా చూసుకోవడంలో బిజీగా ఉంది. ఇప్పట్లో ఆమె సినిమాలకి టైం కేటాయించే అవకాశం లేదు. మరో ఏడాది వరకు కంప్లీట్ గా విశ్రాంతి తీసుకోబోతోంది. తరువాత మరల పెండింగ్ ప్రాజెక్ట్స్ పైన దృష్టి పెట్టనుంది. వీటిలో మేజర్ మూవీగా 'కల్కి పార్ట్ 2' ఉంది. ఈ సినిమా షూటింగ్ వచ్చే ఏడాది ఆఖరులో మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది. 'కల్కి 2898ఏడీ' దీపికా పదుకునే ఫస్ట్ తెలుగు మూవీ కావడం విశేషం. ఈ సినిమాలో ఆమె కల్కికి జన్మనివ్వబోయే సుమతి పాత్రలో నటించింది. ఆమె నటనకి విమర్శకుల ప్రశంసలు లభించాయి. వరల్డ్ వైడ్ గా ఈ మూవీ 1150 కోట్లకి పైగా కలెక్షన్స్ అందుకుంది. ఇదిలా ఉంటే ఈ ఏడాది దీపికా పదుకునే ఫైటర్, కల్కి 2898ఏడీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. డిసెంబర్ లో ఆమె నటించిన సింగం అగైన్ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సినిమాలో అజయ్ దేవగన్, రణవీర్ సింగ్, దీపికా పదుకునే మెయిన్ లీడ్ గా చేశారు. ఈ సింగం అగైన్ సినిమాతో దీపికా పదుకునే రేర్ ఫీట్ అందుకోబోతోంది. ఈ ఏడాది ఈ మూడు సినిమాలతో ఇండియన్ లో 1000 కోట్ల కలెక్షన్స్ వసూళ్లు చేసిన



చిత్రాలలో నటించిన కథానాయికగా మారబోతోంది. గత ఏడాది పఠాన్, జవాన్ సినిమాలతో 1000 కోట్ల క్లబ్ లో దీపికా ఇప్పటికే ఒకసారి చేరింది. మరల ఈ ఏడాది రిలీజ్ అయిన హృతిక్ రోషన్ ఫైటర్ మూవీ 205 కోట్ల కలెక్షన్స్ ని ఇండియాలో అందుకుంది. అయితే ఈ సినిమా కమర్షియల్ డిజాస్టర్ గా నిలిచింది. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కల్కి 2898ఏడీ మూవీ 650 కోట్ల కలెక్షన్స్ ని ఇండియాలో వసూళ్లు చేసింది. ఈ రెండు సినిమాలు మొత్తం కలెక్షన్స్ 805ం కోట్లుగా ఉన్నాయి. డిసెంబర్ లో రిలీజ్ కానున్న సింగం అగైన్ మూవీ ఇండియాలో కనీసం 300ం కోట్లకి పైగా కలెక్ట్ చేస్తుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన చూసుకుంటే ఇండియన్ లో 1000 కోట్లు కలెక్షన్స్ లో రెండో సారి భాగమైన హీరోయిన్ గా దీపికా పదుకునే నిలుస్తుంది. ఇప్పటి వరకు ఇలా రెండు సార్లు 1000ం కోట్లకి వసూళ్లు అందుకున్న హీరోయిన్స్ ఇండియాలో ఎవరు లేరు. అందుకే దీపికా పదుకునేకి 2023, 2024 సంవత్సరాలు చాలా స్పెషల్ అని చెప్పొచ్చు. మరల కల్కి పార్ట్ 2 మూవీ 2026 లేదా 2027లో రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. కల్కితో మరోసారి దీపికా పదుకునే 1000 కోట్ల కలెక్షన్స్ హీరోయిన్ గా మారే అవకాశం ఉంటుందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు.





# ఎఫ్‌టీఎల్ పరిధిలో భారీ భవనాలు.. వీటిని భట్టి ఏం చేయదల్చుకున్నారు?

హైదరాబాద్ ఛ మూసీ ప్రక్షాళన పేద ప్రజలకు నిద్రపట్టని రాత్రులను మిగులుస్తున్నాయి. పండుగ రోజుల్లో వారు సంతోషంగా భోజనం కూడా చేయడం లేదు. ఇక హైడ్రానేమో మధ్య తరగతి ప్రజలకు హార్ట్‌బీట్ పెంచుతోంది. ఎక్కడ తమ నివాసాలు నేలమట్టం అవుతాయేమోనన్న బెంగతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రజలలో ఉన్న సందేహాలను తీర్చే ప్రయత్నం చేశారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలకు భట్టి చెబుతున్న మాటలకు పొంతన లేకపోవడం గమనార్హం. తాము బఫర్‌జోన్‌లోని ఇండ్ల జోలికి వెళ్లమని, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న వాటిపై మాత్రమే దృష్టి పెట్టామని భట్టి చెప్పుకొచ్చారు. ఈ లెక్కన హైదరాబాద్‌లోని చాలా రియల్‌ఎస్టేట్ ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటన్నది సందేహంగా ఉంది. నిర్మితమవుతున్న అనేక నివాసిత భవనాల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారాయి. ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో నిర్మిస్తున్న కాండ్యూర్ స్కైలైన్, మియాపూర్‌లోని వెర్‌టెక్స్ విరాట్, పుప్పాలగూడలోని సమధుర పాలైస్ రాయలె, సైబర్‌సిటీ ఒరియానా, పూజా మ్యాజిక్ బ్రీజ్, ఎస్ఎంఆర్ వినయ్ బౌల్డర్ వుడ్స్, వజ్రమ్, హౌనెర్ సిగ్నేటిస్ భవనాల పరిస్థితిపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇందులో కాండ్యూర్ స్కైలైన్‌లో మెజారిటీ భాగం ఎఫ్‌టీఎల్‌లో ఉంది. అలాగే మెర్‌టెక్స్ కూడా మెజారిటీ పోర్షన్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది. సుమధుర కూడా అంతే! సైబర్‌సిటీ ఒరియానాలో ఓ టవర్ మొత్తం ఎఫ్‌టీఎల్‌లో ఉంది.

పూజా మ్యాజిక్ పూర్తిగా ఎఫ్‌టీఎల్‌లో ఉంది. ఎస్ఎంఆర్ వినయ్‌లో ఓ పెద్ద టవర్‌కు ప్రమాదం ఏర్పడింది. గోపన్నపల్లిలోని వజ్రం కూడా పూర్తిగా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది. హౌనెర్ విషయానికి వస్తే కొద్ది భాగం డేంజర్‌లో పడింది. ఇక కమర్షియల్ కాంప్లెక్సుల విషయానికి వస్తే పుప్పాలగూడలోని ఫినెక్స్ 285 భవంతిలో చాలా భాగం ఎఫ్‌టీఎల్‌లో ఉంది. ఫినెక్స్ 25 -ట్రిటన్ అయితే పూర్తిగా ఎఫ్‌టీఎల్‌లోనే ఉంది. వైష్ణవీ సింబోల్ కూడా పూర్తిగా ఎఫ్‌టీఎల్‌లోనే ఉంది. అయితే ఈ ప్రాజెక్టులను ఏం చేస్తారన్న విషయాన్ని భట్టి విక్రమార్క చెప్పలేదు. ఆ నిర్మాణాలన్నింటికీ రెరా, హెచ్ఎండీఏ అనుమతులు ఉండటం విశేషం. భవిష్యత్తులో జరిగే నిర్మాణాలకైనా జాగ్రత్తగా పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది.




## నాగచైతన్య-సమంత విడాకులపై మంత్రి వ్యాఖ్యలు అనుచితం.. కోర్టులో నాగార్జున

హైదరాబాద్: తన కుటుంబంతో పాటు, కుమారుడు నాగచైతన్య-సమంత విడాకుల వ్యవహారంపై మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారని సినీ నటుడు నాగార్జున నాంపల్లి కోర్టుకు తెలిపారు. రాజకీయ విమర్శల్లో భాగంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ నాగార్జున, నాగచైతన్య, సమంతల పేర్లను ప్రస్తావించారు. ఈ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ క్రమంలో నాగార్జున మంత్రిపై నాంపల్లి కోర్టులో క్రిమినల్ పరువునష్టం దావా వేశారు. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, ఆమెపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. పిటిషన్ విచారణకు స్వీకరించిన న్యాయస్థానం తమ ఎదుట హాజరై వాంగ్మూలం ఇవ్వాల్సిందిగా నాగార్జునకు తెలిపింది. దీంతో ఆయన తన సతీమణి అమల, కుమారుడు నాగచైతన్యతో కలిసి నాంపల్లి కోర్టు ఎదుట హాజరయ్యారు. ఎందుకు పిటిషన్ దాఖలు చేశారని నాగార్జునను న్యాయస్థానం ప్రశ్నించింది. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల వల్ల తమ కుటుంబ పరువు మర్యాదలకు భంగం వాటిల్లిందని ఆయన కోర్టుకు వాంగ్మూలం ఇచ్చారు. రాజకీయ దురుద్దేశంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేశారని, అన్ని టెలివిజన్ ఛానళ్లు, పత్రికల్లో ఆ వ్యాఖ్యలు వచ్చాయని తెలిపారు. అసత్య ఆరోపణలు చేసిన ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టుకు విన్నవించారు. నాగార్జున ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను కోర్టు రికార్డు చేసింది. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యల నేపథ్యంలో ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ నాగార్జున నాంపల్లి కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. "2017లో నా కుమారుడు నాగచైతన్య, సమంత... వివాహ బంధం ద్వారా ఒక్కటయ్యారు. వ్యక్తిగత కారణాల తో 2021లో విడిపోయి ఇద్దరూ గౌరవప్రదంగా జీవిస్తున్నారు. దశాబ్దాలుగా పేరు ప్రఖ్యాతులను కాపాడుకుంటూ వస్తున్న మా కుటుంబంపై మంత్రి సురేఖ రాజకీయ దురుద్దేశంతో నిరాధార వ్యాఖ్యలు చేశారు. వాటివల్ల మా కుటుంబంపై ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లాయి. నిజానిజాలు తెలుసుకోకుండా పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన ఆమెపై చర్యలు తీసుకోవాలి" అని పిటిషన్‌లో కోరారు.

# రవాణాశాఖలో కీలక మార్పులు : మంత్రి పొన్నం



హైదరాబాద్, అక్టోబర్ 8: రవాణా శాఖలో రెండు మూడు సంస్కరణలు తీసుకువస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మోటారు వాహన చట్టంలో భాగంగా దేశంలో 28 రాష్ట్రాలు ఇప్పటికే సారథి వాహన్ పోర్టల్ అమలు చేస్తున్నాయన్నారు. ఇంటర్ స్టేట్ రిలేషన్స్ ఇబ్బంది పడకుండా ఉండటంతో క్షేత్ర స్థాయిలో ఆర్టీవో డీటీవోలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ కూడా సారథి ఈ వాహన పోర్టల్‌లో చేరుతున్నట్లు చెప్పారు. జీవో 28 ద్వారా ఇది అమలు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో, దేశంలో వాహనాలకు సంబంధించి 15 సంవత్సరాలు మనం వాడే వాహనాలు , 8 సంవత్సరాలు ప్రైవేట్ వాహనాలు స్క్రాపింగ్ పాలసీ తీసుకురావడం జరిగిందన్నారు.

**యునిసెఫ్ సహకారంతో...** కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో అమలవుతున్న పాలసీలు అధ్యయనం చేసి ఇక్కడ అమలు చేసే దానిపై జీవో తీసుకొచ్చామని చెప్పుకొచ్చారు. వాహనాలు చెకింగ్‌కు సరైన విధానం అమలు జరగడం లేదని కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ తీసుకొస్తున్నామన్నారు. ఒక్కో సెంటర్‌కు రూ.8 కోట్లు ఖర్చు అవుతుందని... రాష్ట్రంలో 32 సెంటర్లు తీసుకొస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా సంవత్సరానికి లక్షా 60 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కూడా రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక నిబంధనలు తీసుకొస్తున్నామన్నారు. రోడ్డు భద్రతపై యునిసెఫ్ సహకారం తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి పాఠశాలలో రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వచ్చే నెలలో రోడ్డు సేఫ్టీ మంత్ ఉంది.. సిగ్నల్, జీబ్రా క్రాసింగ్ తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి నియమ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇప్పటి వరకు 8 వేల లైసెన్స్2లు రద్దు చేయబడ్డాయన్నారు.

**ఎవరైనా రూల్స్ పాటించాల్సిందే..** "ప్రాణంపోతుంది.. ప్రాణం నుంచి రక్షించుకోవడానికి సుప్రీం కోర్టు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం.. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే డ్రైవింగ్ లైసెన్స్ పొందే అవకాశం ఉండదు. వాహనాలు కొనుక్కున్నా... వారి పేరు మీద నమోదు చేసుకునే అవకాశం ఉండదు. ప్రాణ నష్టాన్ని అవేర్నెస్ క్రియేట్ చేయడం చిన్న పిల్లల స్థాయి నుంచి ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చర్యలు తీసుకోవాలి. ర్యాష్ డ్రైవింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ వాహనాలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. కొత్తగా 113 మంది వెహికల్ ఇన్స్పెక్టర్లు నియామకాలు పూర్తి చేసుకొని విధుల్లోకి రాబోతున్నారు.. వారిని మరింతగా ఉపయోగించుకుంటాం. ఆర్టీసీలో ఎంవీఐ రూల్స్ అమలు అవుతున్నాయి. ఎక్కడ ఇబ్బంది లేదు. జీహెచ్ఎంసీలో ఉన్న వాహనాలు అయినా ఏవైనా రూల్స్ పాటించాల్సిందే. ప్రభుత్వ వాహనాలకు కూడా నిబంధనలు వర్తిస్తాయి.. ఇరు రాష్ట్రాలకు సంబంధించిన రవాణా శాఖ అంశాలు ఇరు రాష్ట్రాల అధికారులు చర్చిస్తారు. టీఎస్ నుంచి టీజీకి మారినప్పుడు.. టీఎస్ వాహనాలు మళ్లీ టీజీగా మారుతాయని చెప్పలేదు. కొత్త వాహనాలు టీజీగా వస్తున్నాయి. నిబంధనలు ఉల్లఘించి వాహనాలు లైసెన్స్ రద్దు అయితే వాళ్ళు వాహనాలు కొనడానికి ఉండదు.. వాహనాలు నడపడానికి ఉండదు. మా డిపార్ట్‌మెంట్ నుంచే కాకుండా యూనిసెఫ్ వారితో కూడా అవగాహన కల్పిస్తున్నాం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.


# కన్వీనర్ కోటాలో ఆ ర్యాంకులకు ఎంబీబీఎస్ సీట్లు రావడం చరిత్రలో ఇదే తొలిసారి.. ఆ ఘనత కేసీఆర్‌దే: హరీశ్ రావు



హైదరాబాద్: వైద్య విద్యకు తెలంగాణను కేరాఫ్ అడ్రస్‌గా చేసిన ఘనత కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నీట్‌లో 3 లక్షలకు పైగా ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు కూడా కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు రావడం సంతోషించదగ్గ విషయమని చెప్పారు. బీసీ ఏ కేటగిరిలో 3.35 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి, ఎస్సీ కేటగిరీలో 3.11 లక్షల ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో 2.89 లక్షల ర్యాంకు, బీసీ బీలో 2.27 లక్షలు, బీసీ సీలో 3.14 లక్షలు, బీసీ డీలో 2.13 లక్షలు, బీసీ ఈలో 2.24 లక్షల ర్యాంకులు సాధించిన వారికి ఎంబీబీఎస్ సీట్లు రావడం చరిత్రలో ఇదే మొదటిసారని తెలిపారు. కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. మారుమూల ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేయడం, తెలంగాణ బిడ్డలు డాక్టర్ కావాలనే కలను స్వరాష్ట్రంలోనే ఉండి సుసాధ్యం చేసుకోవాలని జిల్లాకు ఒక మెడికల్ కాలేజిని కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు. గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 5 నుంచి 34కు పెరిగాయని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తం మెడికల్ కాలేజీల సంఖ్య 20 నుంచి 60కి చేరాయన్ని వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 2850 నుంచి 8315లకు పెరిగిందని, ఎంబీబీఎస్ చదవాలనుకునే విద్యార్థులకు అవకాశాలు గణనీయంగా పెరిగాయన్నారు. "కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు. మూడు లక్షల పైగా ర్యాంకులు వచ్చిన తెలంగాణ విద్యార్థులకు కూడా కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు రావడం సంతోషించదగ్గ విషయం. బీసీ-ఏ కేటగిరిలో 3.35 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి, ఎస్సీ కేటగిరీలో 3.11 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి, ఎస్టీ కేటగిరీలో 2.89 లక్షల ర్యాంకు, బీసీ-బి లో 2.27 లక్షలు, బీసీ-సీ లో 3.14 లక్షలు, బీసీ-డి లో 2.13 లక్షలు, బీసీ-ఈ లో 2.24 లక్షల గరిష్ట ర్యాంకులు సాధించిన వారికి ఎంబీబీఎస్ సీట్లు రావడం చరిత్రలో ఇదే మొదటిసారి. మారుమూల ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేయడం, తెలంగాణ బిడ్డలు డాక్టర్ కావాలనే కలను స్వరాష్ట్రంలోనే వుండి సుసాధ్యం చేసుకోవాలని కేసీఆర్ గారు జిల్లాకు ఒక మెడికల్ కాలేజి ఏర్పాటు చేశారు. కేసీఆర్ పాలనలో గడిచిన పదేళ్ల కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 5 నుంచి 34కు పెరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తం మెడికల్ కాలేజీల సంఖ్య 20 నుంచి 60కి చేరాయి. వైద్య విద్యకు తెలంగాణను కేరాఫ్ అడ్రస్ గా చేసిన ఘనత కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి దక్కుతుంది.

దీంతో తెలంగాణలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 2850 నుంచి 8315లకు పెరిగి, ఎంబీబీఎస్ చదవాలనుకునే విద్యార్థులకు అవకాశాలు గణనీయంగా పెరిగాయి. వైద్య విద్య కోసం చైనా, ఉక్రెయిన్, రష్యా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. రాష్ట్రంలో పెరిగిన మెడికల్ సీట్లను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, తెలంగాణాలో ఉంటూ వైద్య విద్య చదివి దేశానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నాను." అంటూ హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# దండగమారి పాలనలో పండుగ పూట కూడా పస్తులు..! రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్ : ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ సర్కార్‌కు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది కనిపించడం లేదా..? అని కేటీఆర్ నిలదీశారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. దండగమారి పాలనలో పండుగ పూట కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదారు నెలలుగా జీతాల్లేవ్ అని తెలిపారు.

పంచాయతీ వర్కర్స్, మున్సిపాలిటీ కార్మికులు, ఆసుపత్రి సిబ్బంది, హాస్టల్ వర్కర్స్, గెస్ట్ లెక్చరర్స్.. ఇలా ప్రతీ శాఖలో వేతనాల్లేక చిరుద్యోగులు విలవిలలాడిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. చిరుద్యోగులు కుటుంబాలను నెట్టుకురావడానికి అప్పులు చేసి నానా తిప్పలు పడుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఒకటో తారీఖునే జీతాలు ఇస్తామని పలికిన ప్రగల్బాలు ఎటుబాయె..? దసరా దగ్గరికి వచ్చింది.. సరుకులు కొనడానికి చేతిలో నయాపైసా లేదు..! నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో డితే బతుకు బండి నడిచేదెట్లా..? 10 నెలల్లో తెచ్చిన రూ. 80 వేల కోట్ల అప్పులు ఎక్కడికి పోయినయ్..? చిరుద్యోగులు.. చిన్నజీతాల కార్మికుల అవస్థలను పట్టించుకోండి..వెంటనే వేతనాలు చెల్లించండి అని రేవంత్ సర్కార్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు.

# హుస్సేన్ సాగర్.. మూసీ పాపాలకు కాంగ్రెస్ కారణం కాదా?: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్: 'చెరువుల విషయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చర్చకు సిద్ధమా?' అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. గూగుల్ మ్యాప్స్ ఫీచర్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి చెరువుల పరిస్థితి ఎలా ఉందో చూద్దామన్నారు.

మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "భట్టి విక్రమార్క ప్రకటించిన జాబితా ప్రకారం ప్రభుత్వానికి అక్రమ నిర్మాణాలను కూల్చే దమ్ముందా? కూల్చివేతలతో ఇప్పటికే రూ.వెయ్యి కోట్లకు పైగా ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లింది.

రూ.వందల కోట్లు కొల్లగొట్టి కడుపులు నింపుకోవాలనేది ప్రభుత్వం ఆలోచన. హుస్సేన్ సాగర్, మూసీ పాపాలకు కాంగ్రెస్ పార్టీ కారణం కాదా?" అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు.

# తెలంగాణలో మరో రెండురోజులు కొనసాగనున్న వానలు..



తెలంగాణలో రాగల రెండురోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మంగళవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వానలుపడే అవకాశం ఉందని చెప్పింది. బుధవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, గురువారం నుంచి పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది.

# ఈడీ విచారణకు హాజరైన మాజీ ఎంపీ అజహరుద్దీన్



హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. హెచ్‌సీఏలో జరిగిన అవకతవకల వ్యవహారంలో ఇటీవల ఈడీ ఆయనకు నోటీసులు జారీ చేసింది. దీంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా అజహర్ మాట్లాడుతూ తనపై వచ్చినవి తప్పుడు ఆరోపణలని చెప్పారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియానికి సంబంధించి జనరేటర్లు, అగ్నిమాపక వాహనాలు, ఇతర సామగ్రి కొనుగోళ్లకు సంబంధించి రూ.20 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అజహర్‌కు ఈడీ నోటీసులు ఇచ్చి విచారణకు రావాలని ఆదేశించింది.

# మాదిగల ఆగ్రహానికి గురికాక తప్పదు.. రేవంత్‌కు మందకృష్ణ హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబర్ 8: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండానే ఉద్యోగాల భర్తీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తీరును నిరసిస్తూ రేపు (బుధవారం) రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహాల నుంచి కలెక్టర్ కార్యాలయాల వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేయాలని.. కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని నేతలకు పిలుపునిచ్చారు.

**మాలలకు కొమ్ము కాస్తూ...** హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి బషీర్ బాగ్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసిందని.. మాదిగలను నట్టేట ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగల పట్ల ఎనలేని ప్రేమ ఉన్నట్లు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆచరించడం లేదని.. మాలల పక్షాన నిలుస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి మాలలకు కొమ్ము కాస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పీసీసీ చీఫ్‌గా మాదిగలకు తక్కువ సీట్లు ఇచ్చి.. మాలలకు ఎక్కువ టికెట్లు ఇచ్చారని మండిపడ్డారు. శాసనసభ ఎన్నికల్లో మాదిగలకు నాలుగు సీట్లు తగ్గడానికి కారణం రేవంత్ రెడ్డి అని ఆరోపించారు.

**అలా చెప్పి.. ఇలా చేస్తారా...** వివేక్, వినోద్ ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండగా.. వంశికి ఎంపీ టికెట్ ఇచ్చారన్నారు. పార్టీ మారి వచ్చిన వివేక్ కుటుంబంలో రెండు సీట్లు ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డి వాళ్లతో కుమ్మక్కయ్యారని విమర్శించారు. కడియం శ్రీహరిని తానే ఆహ్వానించానని రేవంత్ రెడ్డే చెప్పారని.. సిట్టింగ్ ఎంపీ అయిన పసునూరు దయాకర్‌కు టికెట్ రాకుండా అడ్డుకున్నారని చెప్పారు. అసెంబ్లీ సాక్షిగా ఎస్సీ వర్గీకరణను తొలుత దేశంలో అమలు చేసే రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని చెప్పారని గుర్తుచేశారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన అర్ధ గంటకే రేవంత్ రెడ్డి ప్రకటించారన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన ఉద్యోగాలకు కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పారని తెలిపారు. అయితే రెండు నెలలు కాకముందే రేవంత్ రెడ్డి మాదిగలకు వెన్నుపోటు పొడిచారని విరుచుకుపడ్డారు.

# భయం వద్దు.. నిశ్చింతగా ఉండండి.. ప్రజలకు నష్టం జరగకుండా చూస్తా

హైదరాబాద్: మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, స్థానికులకు తాను అండగా ఉంటానని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ భరోసా ఇచ్చారు. చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలోని సాయిబాబా ఆలయం వద్ద మూసీ పరీవాహక ప్రాంతవాసులతో మధుయాష్కీగౌడ్ సమావేశమయ్యారు. స్థానికులు మాట్లాడుతూ తాము ఇళ్లు కోల్పోతామేమోనని ఆందోళనను వ్యక్తం చేశారు. మధుయాష్కీ స్పందిస్తూ.. ఎవరూ భయపడవద్దని వారి చేతిలో చేయి వేసి ధైర్యం చెప్పారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణలో భాగంగా మూసీ నిర్వాసితుల విషయంలో ప్రభుత్వం అన్నివిధాలుగా ఆలోచిస్తుందన్నారు. మూసీ సుందరకరణ విషయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా ఆలోచిస్తుందన్నారు. నగరం లోపల మూసీ వేరని, చైతన్యపురి, కొత్తపేట, నాగోల్ లాంటి శివారు ప్రాంతంలో వేరని పేర్కొన్నారు. చైతన్యపురి, కొత్తపేట, నాగోల్ ప్రాంతాలలో మూసీ చాలా విశాలంగా ఉందన్నారు. ఇళ్లు కోల్పోకుండా.. ఇళ్లులేని వైపు ఎక్కువగా భూసేకరణ చేసే విధంగా ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు. ప్రజల సందేహాల నివృత్తికి ఇక్కడి ప్రాంత వాసులను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వద్దకు తానే తీసుకెళ్లి మాట్లాడిస్తానని స్పష్టంచేశారు. ప్రజలతో చర్చించకుండా, ఎవరి ఇళ్లు అన్యాయంగా కూల్చరు అని ఆయన పేర్కొన్నారు. మాజీమంత్రి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఈ ప్రాంత చెరువులు, కుంటలు మింగేశారని మండిపడ్డారు. కబ్జాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపడతామని హెచ్చరించారు. చెరువులను చెరబట్టిన అక్రమార్కులపై విచారణ జరిపించడం ఖాయమన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com